పెన్ పవర్
తెలంగాణ రౌండప్

రెవెన్యూ కూల్చివేతల్లో..! స్వల్ప ఉద్రిక్తత..!

- కబ్జాలను సహించేది లేదన్న కుత్బుల్లాపూర్ తహశీల్దార్ రాజేష్..
- అడ్డుకున్నా వదిలిపెట్టం..! క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎమ్మార్వో హెచ్చరిక..

ఆర్ఐ పర్యవేక్షణలో, సర్వే నెంబర్ 49/6లో రెవెన్యూ కూల్చివేతలు..

- పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ చర్యలు..
- అయినప్పటికీ కాసేపు రెవెన్యూ చర్యలను అడ్డుకున్న కబ్జాదారులు..
- కూల్చివేతల వద్దకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్..
- పాత నిర్మాణాలు ముట్టుకోవద్దని అధికారులకు సూచన..
- బాధితుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని శ్రీశైలంగౌడ్ హామి..
- ఆదివారం రాత్రి కొత్తగా నిర్మించిన 2 గదులు మాత్రమే కూల్చేసిన రెవెన్యూ..
- గుడి నిర్మాణానికి బేస్‌మెంట్ నిర్మించినట్టు గుర్తించిన రెవెన్యూ అధికారులు..

- గాజులరామారం సర్వే నెంబర్: 49/6 ప్రభుత్వ భూమిలో కబ్జాలు..
- రాత్రికి రాత్రే నిర్మించిన రెండు గదులను నేలమట్టం చేసిన అధికారులు..!
- ముగ్గురిపై సూరారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుకు అధికారుల ఫిర్యాదు..

గాజులరామారం సర్వే నెంబర్. 49 ప్రభుత్వ భూమిని దిల్ నిర్మాణ సంస్థకు 2011లోనే దాదాపు 16 ఎకరాల పైచిలుకు ప్రభుత్వం కేటాయించింది.. సంబంధిత భూమిలో అంతకుముందే కొన్ని నిర్మాణాలు ఉండటంతో, దిల్ సంస్థకు పూర్తిస్థాయిలో అప్పగించలేక పోయినట్లు సమాచారం.. గతంలో ఒక్కో అధికారి హయాంలో, క్రమేణా కబ్జాలు అధికమయ్యాయి.. బండల వ్యాపారంతో ఒకరు, పేదల గుడిసెలతో కొందరు, ఎవరికి వారే ఆక్రమణలో ఉండటంపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించారు.. దీంతో సర్వే నెం.49 లోని ప్రతి సబ్ డివిజన్‌లోనూ ఆక్రమణల పర్వానికి అడ్డు లేకుండా పోయింది.. అటు దిల్ సంస్థ కూడా పూర్తిగా ఇరువైపు కన్నెత్తి చూడక పోవడం, కబ్జాదారులకు మరింత అవకాశంగా మారింది.. నివురుగప్పిన నిప్పులా ఈ కబ్జా దందా నిత్యకృత్యంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. తాజాగా నిర్మించిన రెండు గదులపై కూల్చివేతలకు వెళ్లిన అధికారులను అడ్డుకోవడంతో స్థానికంగా ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.. దీంతో అధికారులను అడ్డుకున్న ముగ్గురు కబ్జాదారులపై.. రెవెన్యూ అధికారులు కేసులు నమోదుకు ఫిర్యాదు చేశారు.. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ చొరవతో కూల్చివేతలు తాత్కాలికంగా నిలిపివేశారు..
మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 20:

రెండు గదులను జేసీబీతో కూల్చేస్తున్న దృశ్యం..

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

ఖజానా చిల్లులకు ఇక చెల్లుచీటీ

- హైడ్రా, ఈగల్ తరహాలో ప్రత్యేక విభాగం
- రాబడికి గండి కొడుతున్న వారిపై కఠిన చర్యలు
- ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూర్చే శాఖల్లో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. భూములు, నీటి వనరుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన 'హైడ్రా', మాదక ద్రవ్యాల నియంత్రణకు నెలకొల్పిన 'ఈగల్' మాదిరిగా... ఆదాయాన్ని సమకూర్చే శాఖల్లోని లీకేజీలను అరికట్టడానికి 'ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం' నెలకొల్పాలని ఆదేశించారు. ఇదే విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) సంజయ్ జాజు, డీజీపీ ఆనంద్ సహా సీఎంవో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఖజానాకు ఆశించినట్లుగా ఆదాయం పెరగకపోవడానికి కారణాలపై సీఎం ఆరా తీశారు. రాబడిలో లీకేజీలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకునే వ్యవస్థ ఉంటేనే... అక్రమార్కుల్లో భయం ఏర్పడుతుందని ఉన్నతాధికారులు అభిప్రాయపడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో హైడ్రా, ఈగల్ వ్యవస్థల పనితీరుతో వచ్చిన ఫలితాలపైనా చర్చించారు. ఇదే తరహాలో ఆదాయ వనరుల సమీకరణపైనా పటిష్ఠమైన తనిఖీ, నియంత్రణ విభాగం ఉంటే ప్రభుత్వానికి కచ్చితంగా ఆదాయం పెరుగుతుందనే

-4లో

తెలంగాణలో నేడు పలు జిల్లాలకు వర్ష సూచన

సిర్పూర్ (యు)లో 10.1 సెం.మీ. వర్షం

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో మంగళవారం పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, పరిసర ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని తెలిపింది. ఈ ప్రభావంతో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది.

-4లో

రెవెన్యూ కూల్చివేతల్లో..! స్వల్ప ఉద్రిక్తత..!

PEN POWER 24 NEWS
పెన్ పవర్
తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు
బుధవారం 22 ఏప్రిల్ 2026 పెన్ పవర్ 5
•కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెం.49/6 దిల్ సంస్థకు కేటాయింపు.
•2011లో దిల్ నిర్మాణ సంస్థకు 11-30 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది..
•ఆర్డీవో ఆదేశాలతో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ నిర్మాణాలు పరిశీలన..
•నివేదిక ఆధారంగా మల్కాజిగిరి ఆర్డీవో కూల్చివేతలకు ఆదేశాలు..
•సంబంధిత భూమిలో వెలిసిన 15 అక్రమ నిర్మాణాలు మంగళవారం నేలమట్టం..!
అక్రమ నిర్మాణాలపై... రెవెన్యూ కొరడా
గాజులరామారం సర్వే నెంబర్ 49 ప్రభుత్వ భూమిలో కూల్చివేతలు..
ఆర్డీవో ఆదేశాలతో పరిశీలించి కూల్చివేతలు..

గత ఏప్రిల్ 21న రెవెన్యూ కూల్చివేత.. 22న పేపర్లో..

- 3 పేజి తరువాయి
ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపు చర్యలు ఉద్రిక్తతకు దారితీశాయి.. పోలీసు బలగాల బందోబస్తు మధ్య కూల్చివేతలకు వెళ్లిన కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులను కొందరు కబ్జాదారులు అడ్డుకున్నట్లు అధికారులు తెలిపారు.. ఓదశలో కబ్జాదారులు కొందరిని రప్పించి వీరంగం సృష్టించేందుకు ప్రయత్నించగా పోలీసులు చెదరగొట్టారని సమాచారం.. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెంబర్ 49/6లోని స్థలం దిల్ సంస్థకు కేటాయించిన ప్రభుత్వ భూమిగా అధికారులు పేర్కొంటున్నారు. ఇదే స్థలంలో గత ఏప్రిల్ 21న కూడా డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలపై కూల్చివేతలు చేపట్టి 15 రూములు తొలగించారు.. అయితే అధికారులు కూల్చివేతలు

గతంలో కూల్చివేతలు.. మళ్లీ నిర్మాణాలు

గాజులరామారం సర్వే నంబర్ 49/6లో అక్రమ నిర్మాణాలపై గత ఏప్రిల్ 21న కూడా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు.. డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ ఆధ్వర్యంలో అప్పట్లో కూల్చివేతలు నిర్వహించి 15 రూములు కూల్చేశారు.. అయినప్పటికీ కొద్ది రోజుల్లోనే అదే స్థలంలో మళ్లీ నిర్మాణాలు వెలువడటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ప్రభుత్వ భూముల్లో కూల్చివేతలు చేపట్టిన తర్వాత కూడా తిరిగి అక్రమ నిర్మాణాలు ఎలా వెలుస్తున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.. సర్వే నెంబర్ 49/6లో అక్రమ నిర్మాణాల వ్యవహారంపై రాజకీయ ఒత్తిళ్ళు భవిష్యత్తులో ఎలాంటి మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

చర్యల వద్దకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్..

కూల్చివేతలు జరుగుతున్న విషయం తెలుసుకున్న కొందరు కబ్జాదారులు పాత నిర్మాణాలు కూల్చేస్తున్నారన్న, తప్పుడు సమాచారాన్ని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు ఫోన్ చేసినట్లు తెలుస్తోంది.. దీంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.. అధికారులతో మాట్లాడి విషయాన్ని గ్రహించిన ఆయన, కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అక్కడున్న వారికి సూచించారు.. అదేవిధంగా తను కలెక్టర్‌తో మాట్లాడుతాను అంటూ అధికారులకు చెప్పడంతో, కూల్చివేతలను రెవెన్యూ అధికారులు తాత్కాలికంగా నిలిపివేసి అక్కడి నుంచి వెనుదిరిగారు.. అయితే ఆదివారం రాత్రికి రాత్రే నిర్మించిన రెండు గదులను మాత్రం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గుడి నిర్మాణం కోసం చేపట్టిన బేస్‌మెంట్ నిర్మాణం విషయంలో తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు..

రాత్రికి రాత్రే రెండు గదులు.. గుడికి బేస్మంట్ నిర్మాణం..

ఆదివారం రాత్రి అక్రమంగా రెండు గదులు నిర్మించినట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. అదేవిధంగా గుడి నిర్మాణం కోసం బేస్‌మెంట్ నిర్మాణ పనులు కూడా చేపట్టినట్లు అధికారులు గుర్తించారు.. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ తహశీల్దార్ రాజేష్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్, ఆర్ఐ ఖలీమ్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సోమవారం అక్కడికి చేరుకున్నారు.. పోలీసుల భద్రత మధ్య కూల్చివేత చర్యలు ప్రారంభించగానే, అక్కడ ఉన్న కొందరు కబ్జాదారులు అధికారులను అడ్డుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది..



ముగ్గురిపై పోలీస్ కేసు..!

అక్రమ నిర్మాణాలకు కారణమైన ముగ్గురిపై సూరారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.. ఎలాంటి అనుమతులు లేకుండా గుడి నిర్మాణం చేపడుతున్న ఆర్.ఎం.రాజు అలియాస్ ఉంగరాల రాజు, అక్రమ గదుల నిర్మాణంలో శోబన్ కుమార్, దిలిప్ ప్రకాశ్ పవార్‌లపై, రెవెన్యూ అధికారులు కేసు నమోదుకు ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు.. ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ రాజేష్ కబ్జాదారులను హెచ్చరించారు..

కొత్త నిర్మాణాలు చేపట్టకుండా మాజీ ఎమ్మెల్యే సూచనలు..

కూల్చివేతల వద్దకు మాజీ ఎమ్మెల్యే కూనా శ్రీశైలం గౌడ్, చిత్రంలో డిటి, ఆర్ఐ..

తెలంగాణలో నేడు పలు జిల్లాలకు వర్ష సూచన

-3 పేజి తరువాయి
మరోవైపు రాష్ట్రంలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు కొన్ని చోట్ల భారీగా, మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు)లో 10.1 సెం.మీ. వర్షపాతం నమోదయింది. నల్గొండ జిల్లా కట్టంగూరు 8.2, నిజామాబాద్ గ్రామీణ మండలం మల్కాపూర్ 8.1 సెం.మీటర్ల వర్షపాతం నమోదయింది.

ఖజానా చిల్లులకు ఇక చెల్లుచీటీ

-3 పేజి తరువాయి
అభిప్రాయం వ్యక్తమైంది. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనులు, పౌర సరఫరా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు తదితర శాఖల పనితీరు అంచనాల మేరకు ఉండటం లేదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ శాఖల ఆదాయ మార్గాలకు కొందరు ఎక్కడికక్కడ తూట్లు పొడుస్తుండడం సర్కారుకు సవాల్‌గా మారింది. పన్నులు, రుసుముల వసూళ్లలో అక్రమాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి... కఠిన చర్యలు తీసుకోవడానికి ఒక పటిష్ఠ నిఘా వ్యవస్థ లేదు. ప్రతి శాఖలో విజిలెన్స్, తనిఖీ విభాగాలున్నా... అవి నామమాత్రంగా పనిచేస్తున్నాయి. పైగా సంబంధిత శాఖకు చెందిన అధికారులే విజిలెన్స్ విభాగాల్లో ఉంటున్నందున... తమ సహచరుల అక్రమాలను చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారనే ఆరోపణలు న్నాయి. ఈ నేపథ్యంలో అన్ని ఆదాయ శాఖలకు కలిపి ఉన్నత స్థాయిలో ఒక నిఘా విభాగం ఉండాలని, అప్పుడు అక్రమాలను అరికట్టడం ద్వారా ఖజానాకు ఆదాయం పెరుగుతుందని ఉన్నతాధికారులు సూచించినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనపై సీఎం రేవంత్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి సంబంధించిన నిర్మాణం ఎలా ఉండాలి... ఏ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలి... ఎందరు సిబ్బంది అవసరమవుతారు... దీనికి ప్రత్యేక
అధికారాలు ఇవ్వడానికి ప్రభుత్వపరం గా తీసుకోవాల్సిన చర్యలేమిటి... తదితర అంశాలపై సమగ్ర ప్రతిపాదనలను రూపొందించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇదే అంశంపై వారం రోజుల్లో మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.

వాణిజ్య ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలి

గార్ల పెన్ పవర్ జూలై 20: సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం పిలుపు మేరకు గార్ల మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో సోమవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాల ప్రతులను దగ్ధం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈ సందర్భంగా ఏ ఐ కె ఎం ఎస్ మండల కార్యదర్శి గౌని మల్లేశం మాట్లాడుతూ భారత్-అమెరికా మధ్య కుదుర్చుకునే వాణిజ్య ఒప్పందాలు దేశ వ్యవసాయ రంగం, రైతులు, వ్యవసాయ కూలీలు, చిన్న వ్యాపారులు, వినియోగదారుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. బహుళజాతి కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం రైతుల హక్కులను, దేశ ఆహార భద్రతను తాకట్టు పెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించకూడదని హెచ్చరించారు. దేశ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర, కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ, వ్యవసాయ రంగానికి అవసరమైన ప్రభుత్వ పెట్టుబడులు పెంచడం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం విదేశీ ఒత్తిళ్లకు తలొగ్గి వాణిజ్య ఒప్పందాలకు సిద్ధపడడం బాధాకరమన్నారు. రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టే ఇటువంటి ఒప్పందాలను వెంటనే రద్దు చేసి, రైతు--కూలీల ప్రయోజనాలను కాపాడే విధానాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు, గౌని భద్రయ్య,

పిడిఎస్యూ జిల్లా అధ్యక్షుడు ఎం మహేష్,బోలీషా, శ్రీను, వెంకన్న, వెంకటేశ్వర్లు, రోశయ్య, రాంబాబు, శ్రీనివాస్, బండి రమేష్, శ్రీరాములు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, పెన్ పవర్, జూలై 20: తెలంగాణ బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపుకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఎల్బీనగర్ నియోజకవర్గం బీఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మెడికల్ అండ్ హెల్త్ కాలనీలో ఆదివారం రాత్రి బోనాల ఫలహార బండి ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, రాజకీయ నేతలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆయనను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా కలిసిమెలిసి పండుగలను జరుపుకోవడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతల రవికుమార్ గుప్త, నిర్వాహకులు అఖిలేష్ గౌడ్, సుజన, కాలనీ సభ్యులు, నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి ఎస్పీ శబరిష్

గార్ల పెన్ పవర్ జూలై 20: గ్రామ స్థాయిలో పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు గార్ల మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ను సోమవారం ఆయన ఆకస్మికంగా

సందర్శించి పోలీస్ స్టేషన్ పనితీరును సమీక్షించారు.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న స్టేషన్ రికార్డులు, కేసు దర్యాప్తు ఫైళ్లు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ నిర్వహణ, , రిసెప్షన్, రికార్డు నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తు నాణ్యతను పెంచుతూ, చట్టపరమైన విధానాలను పాటిస్తూ త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై వారి విధుల నిర్వహణ, సమస్యలు, పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. వి పి ఓ ఎస్ లు తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తున్నారా, గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు, గ్రామ పెద్దలు, యువత, ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.గ్రామాల్లో గంజాయి రవాణా, విక్రయాలు, మత్తు పదార్థాల వినియోగంపై నిరంతరం నిఘా ఉంచాలని, అనుమానాస్పద సమాచారం లభించిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో సమాచార ఉండాలని ఆదేశించారు.ప్రతి పోలీసు సిబ్బంది తమ విధిని కేవలం ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా, అంకితభావంతో నిర్వహించాలని, ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ సత్వర స్పందన

అందించాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని, ఫిర్యాదులను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.బీట్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని,

రౌడీషీటర్లు, పాత నేరస్థులు, మత్తు పదార్థాల వ్యాపారుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణ, మహిళలు మరియు చిన్నారుల భద్రతపై గ్రామస్థులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, క్రమశిక్షణ, ప్రజలకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఎస్పీ, ప్రతి అధికారి సిబ్బంది అంకిత భావనతో పనిచేస్తూ జిల్లా పోలీస్ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బయ్యారం ఎస్సై రవీందర్ గార్ల ఎస్ఐ సాయికుమార్ ఏ ఎస్ ఐ వెంకట్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏ ల సమస్య లు పరిష్కారించాలని బ్యాంక్ ఎదుట ఆందోళన

గార్ల పెన్ పవర్ జూలై 20: ఓటిఎస్ పూర్తిచేసిన డ్వాక్రా సంఘాలకు తిరిగి రుణాలు మంజూరు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఐకెపి వివోఏ ల సమస్యలను పరిష్కరించాలని ఐకెపి వివోఏ ల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్ బి ఐ బ్యాంక్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాల డాక్యుమెంటేషన్ బ్యాంకు లోనే చెల్లించాలని, డాక్యుమెంట్ రికవరీ ఫీజుల పేరిట అధిక చార్జీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సంఘం సభ్యులు లీడర్ల ప్రేమయం లేకుండా సంఘాల ఖాతాలలో అప్పులను జమ చేయవద్దని కోరారు. నెలల తరబడి గ్రూపులను బ్యాంకు చుట్టూ తిప్పవద్దని, వివో ఏ ల పట్ల ఫీల్డ్ ఆఫీసర్ నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో వివోఏ ల ఉద్యోగుల సంఘం నాయకులు సి హెచ్.మౌనిక, అనిత, వినోద, అరుణ, కల్పన,లత, స్వర్ణ, విజయ, సునీత, విజయ్, జ్యోతి, రజని, శారద, తదితరులు పాల్గొన్నారు.

ఔటర్ రింగ్ రోడ్‌పై ఆధునిక హరిత నిర్వహణ

ప్రమాదాల నివారణకు చర్యలు

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)పై ఆధునికీకరించిన హరిత నిర్వహణ వ్యూహంలో రహదారి భద్రతా ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు 'ఆటోమేటెడ్ యంత్రాలు'లతోపాటు ఆటోమెటిక్ నీటిని అందించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రధాన క్యారేజ్‌వేపై జరిగిన పలు ప్రాణాంతక ప్రమాదాల నేపథ్యంలో ప్రయాణికులు, క్షేత్రస్థాయి సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)' మానవ శ్రామికులపై ఆధారపడే పద్ధతులు, సంప్రదాయ వాటర్ ట్యాంకర్ల వినియోగాన్ని వేగంగా తగ్గిస్తూ, ఆధునిక యాంత్రిక విధానాలను అమలు చేస్తోంది.

158 కిలోమీటర్లు

హైదరాబాద్‌లోని నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) 158 కి.మీ. పొడవు గల, 8-లేన్ల యాక్సెస్-కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే. హైదరాబాద్ మహానగర ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించే లక్ష్యంతో దీనిని అభివృద్ధి చేశారు. ప్రధాన జాతీయ రహదారులు, విమానాశ్రయ మార్గాలు, హైదరాబాద్ పరిసర అభివృద్ధి కేంద్రాలను ఓఆర్ఆర్ అనుసంధానిస్తుంది. 2006 నుండి 2018 మధ్య దశలవారీగా సుమారు రూ. 8,821.95 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఇరువైపులా 2-లేన్ల సర్వీస్ రోడ్లు ఉన్నాయి. 5 మీటర్ల వెడల్పు గల సెంట్రల్ మీడియన్ ఉంది. 150 మీటర్ల రైట్ ఆఫ్ వేలో గంటకు 120 కి.మీ. డిజైన్ వేగంగా వాహనాలు దూసుకుపోతున్నాయి. వీటితోపాటు 19 ఇంటర్‌చేంజ్‌లు ఉన్నాయి.

ఘనంగా మోత్కూరి నారాయణరావు జన్మదిన వేడుకలు

ఖమ్మం, పెన్ పవర్, జూలై 20: ఖమ్మం నగరంలో వివేకానంద సేవా సమితి చైర్మన్ మోత్కూరి నారాయణరావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరక్ష హాస్పిటల్ అధినేత, భారతీయ జనతా పార్టీ తెలంగాణ కార్యవర్గ సభ్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ జివి, భారతీయ జనతా పార్టీ తెలంగాణ కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్ లు కలిసి నారాయణరావుకు గజమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మోత్కూరి నారాయణరావు సమాజ సేవను లక్ష్యంగా చేసుకొని ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆయురారోగ్యాలతో, ఆనంద సంతోషాలతో నిండి మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షేక్ ఏడుకొండలు, రుద్ర ప్రతాప్, రాకేష్ దత్త, పిల్లలమర్రి వెంకట్, శ్యామ్, జగన్, ఊరుకొండ ఖాదర్ బాబు, గజ్జల శ్రీనివాస్, ఆర్ హెచ్ బి ఎస్ ఆర్ హెచ్ బృందం సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు ఎందుకు వచ్చాయో వివరించాలి

హైదరాబాద్ పెన్ పవర్: కాళేశ్వరం ప్రాజెక్టుపై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ లోపాలు ఎందుకు వచ్చా యో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రంతో కలిసి ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి హరీష్ రావు పాదయాత్ర ఉనికి చాటుకునేందుకు నిర్వహించి న రాజకీయ కార్యక్రమం అన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను ప్రభుత్వ వైఫల్యం గా చిత్రీకరించడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. సిద్దిపేట నియోజక వర్గంలో ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారో, కాలువల నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదో హరీశ్ రావు ప్రజలకు వివరించాలని కోరారు. రానున్న మున్సిపల్, శాసనసభ ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్

పార్టీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించి మంత్రి కూడా అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ డిపార్ట్ మెంట్ చైర్మన్ తప్పెట శంకర్, నాయకులు సాకి ఆనంద్, మంద పాండు, పుట్ల యేసు, దేవయ్య, బయ్యారం యాదగిరి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మనుబోతులగూడెంలో పోడు భూముల వివాదం

హైదరాబాద్ పెన్ పవర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మనుబోతులగ ూడెంలో పోడు భూముల వివాదం నేపథ్యంలో ఇటీవల అటవీశాఖ సిబ్బంది, ఆదివాసుల మధ్య చోటుచేసుకున్న ఘటనపై సోమవారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, జిల్లా అటవీశాఖ అధికారి విక్రమ్ సింగ్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) రాహుల్, ఎఫ్‌డీవో బాబు తదితర అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు.ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్‌తో పాటు గ్రామస్థుల నుంచి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోడు భూముల సమస్య, అటవీ భూముల పరిరక్షణ, ఆదివాసుల జీవనాధారాలకు సంబంధించిన అంశాలపై సమగ్ర సమాచారం సేకరించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక సిద్ధం చేసి తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ.. గిరిజనుల హక్కులను పరిరక్షించే చట్టాలకు అనుగుణంగా సమగ్ర దర్యాప్తు నిర్వహించి, వాస్తవాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజాధనం వృథాకు నిలువెత్తు సాక్ష్యం

నల్గొండ, జూలై 20, పెన్ పవర్:
నల్లగొండ జిల్లాలోని 7బి డిస్ట్రిబ్యూటరీ కాలువ కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. పీఏ పల్లి మండలంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి గుర్రంపోడు మండల ఎగువ ప్రాంతాల వరకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును మొదలుపెట్టారు. 2008లో 19 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 18 కిలోమీటర్ల మేర ఈ కాలువ తవ్వకానికి శ్రీకారం చుట్టారు. 2009 జనవరిలో ప్రారంభమైన పనులు అత్యంత నత్తనడకన సాగి 2018 నాటికి తానేదారిపల్లి వరకు మాత్రమే పూర్తయ్యాయి. ఆ ఏడాది అట్టహాసంగా నీటిని విడుదల చేసినా, ఆ తర్వాత అధికారుల నిర్లక్ష్యం కారణంగా కృష్ణా జలాలు మళ్లీ ప్రవహించలేదు. సుమారు దశాబ్ద కాలంగా ఈ కాలువ కేవలం కాగితాలకే పరిమితమై, నీటి కోసం ఎదురుచూసే రైతులకు కన్నీళ్లను మిగులుస్తూ శిథిలావస్థకు చేరింది. ఈ ప్రాజెక్టు వైఫల్యానికి కాలువ డిజైనింగ్‌లో జరిగిన తీవ్రమైన లోపాలే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. ఇతర కాలువల వలె కాకుండా, దీనిని ఏకంగా 9 నుండి 12 మీటర్ల లోతులో డీప్ కట్‌గా తవ్వడం శాపంగా మారింది. దీని ఫలితంగా కాలువలో నీరు ఉన్నప్పటికీ, అవి గ్రావిటీ ద్వారా పక్కనే ఉన్న ఆయకట్టు పొలాలకు చేరడం అసాధ్యంగా మారింది. గతేడాది వర్షాకాలంలో ముక్కపల్లి చెరువు తెగి వర్షపు నీరు కాలువలోకి చేరగా, డీప్ కట్ కారణంగా కేవలం ఊట నీరు పైకి వచ్చిందే తప్ప అసలైన సాగునీరు అందలేదు. పీఏ పల్లి, గుర్రంపోడు మండలాల్లోని మొత్తం 10 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ కాలువ ద్వారా నీరు అందించాలనే ప్రణాళికలు అశాస్త్రీయ నిర్మాణాల కారణంగా విఫలమయ్యాయి. డివిజన్ల విభజన గందరగోళంతో అధికారులు బాధ్యత తీసుకోక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం మైలాపురం నుండి తానేదారిపల్లి వరకు కాలువ తవ్వకం పూర్తి కాగా, అక్కడి నుండి తేనపల్లి చెరువు వరకు జరగాల్సిన మరో 3 కిలోమీటర్ల పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తానేదారిపల్లి చెరువును రిజర్వాయర్‌గా మార్చి, కొత్త డిజైన్‌తో ముందుకు వెళ్తామని చెప్పిన అధికారులు ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడలేదు. గతంలో మంజూరైన నిధుల్లో ఇప్పటికీ 5 కోట్ల రూపాయలు మిగిలి ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఒకవేళ ఈ 3 కిలోమీటర్ల పనులు సకాలంలో పూర్తయితే, అదనంగా మరో 3 వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. అరకొర పనుల వల్ల కాలువ పక్కన ఉన్న రైతులు తమ పొలాల్లోకి వెళ్లలేని దుస్థితి నెలకొంది. అంతర్గత బ్రిడ్జిల నిర్మాణం పెండింగ్‌లో ఉండటంతో రైతులు తమ సాగు పనుల కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. కాలువ తవ్వకం వల్ల రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా బ్రిడ్జిలు లేక రెండు విధాలుగా నష్టపోతున్నారు. మిగిలి ఉన్న 5 కోట్ల రూపాయల నిధులను తక్షణమే విడుదల చేసి నిలిచిపోయిన పనులను పూర్తి చేస్తేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. గుర్రంపోడు, గుడిపల్లి వాగుల్లో చిన్న తరహా రిజర్వాయర్లను నిర్మిస్తే భూగర్భ జలాలు స్థిరంగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల కాలువ నీటిపైనే ఆధారపడకుండా బోరు బావుల ద్వారా రైతులు పంటలు పండించుకునే వెసులుబాటు లభిస్తుంది. డీప్ కట్ వల్ల నీరు అందని ప్రాంతాల్లో చిన్నపాటి లిఫ్ట్ మెకానిజం ఏర్పాటు చేయడం ద్వారా ఆయకట్టుకు నీరు మళ్లించేలా రీడిజైన్ చేయాలి. ఏళ్లుగా సాగునీరు అందక అలమటిస్తున్న వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందించి, రైతాంగానికి ఆర్థిక భరోసా కల్పించాలని ఆ ప్రాంత రైతులు వేడుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 7బి డిస్ట్రిబ్యూటరీకి శాశ్వత మోక్షం కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. కోట్లాది రూపాయల నిధులు వృథా కాకుండా చూడటంలో జిల్లా యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం. నీటిని వృథాగా పోనివ్వకుండా, ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి నీరు అందేలా ప్రణాళికలు రూపొందించడంపై దృష్టి సారించాలి.

క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అంచనా వేయకుండా చేసిన పనులు అట్టహాసంగా మొదలై చివరకు విఫలమయ్యాయి. ఇప్పుడు మిగిలి ఉన్న నిధులను పారదర్శకంగా వినియోగించి, నిర్మాణ లోపాలను సరిదిద్దడం ద్వారా మాత్రమే రైతుల కష్టాలకు తెర పడుతుంది. సాగునీటి సౌకర్యం కల్పిస్తేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం కావడమే కాకుండా, రైతులు వ్యవసాయంలో లాభాలను పొందే అవకాశం ఉంటుంది. అధికారులు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాలి. నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల్లో జరిగిన ఈ తప్పిదాలు భవిష్యత్తులో ఇతర పథకాల అమలులో అధికారులకు హెచ్చరికగా మారాలి. కేవలం నిధులు ఖర్చు చేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రణాళికలు, అధికారుల సమన్వయం ఉండటం చాలా అవసరం.

10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే సంకల్పం నెరవేరాలంటే ఇంజనీరింగ్ విభాగం తక్షణమే రీడిజైన్ ప్రక్రియను చేపట్టాలి. 5 కోట్ల నిధుల వినియోగంలో జాప్యం జరగకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్ కార్యాలయంపై ఉంది. రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, తానేదారిపల్లి నుండి తేనపల్లి చెరువు వరకు కాలువ తవ్వకం పూర్తి చేయాలి. బ్రిడ్జిల నిర్మాణం, లిఫ్ట్ పాయింట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తేనే ప్రాజెక్టు సార్థకత ఉంటుంది. ఇప్పటికైనా యంత్రాంగం మేల్కొంటేనే వేల ఎకరాలకు నీరు అంది రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరడం సాధ్యమవుతుంది

గులాబీ కంచుకోటపై కాంగ్రెస్ కన్ను

కరీంనగర్, జూలై 20, పెన్ పవర్:
తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ఇప్పుడు సరికొత్త, అత్యంత వ్యూహాత్మకమైన అంతర్గత పోరాటం సాగుతోంది. నిన్నటివరకు తిరుగులేని రాజకీయ శక్తులుగా, అజేయమైన కోటలుగా వెలిగిన బీఆర్ఎస్ టాప్ లీడర్ల సొంత నియోజకవర్గాలపై అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా కన్నేసింది. గులాబీ దళపతి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డా సిరిసిల్ల, ట్రబుల్ షూటర్ హరీష్ రావు కంచుకోట సిద్దిపేట నియోజకవర్గాల్లో పొలిటికల్ హీట్ అమాంతం పెరిగింది. ప్రధాన నేతలను నేరుగా ఢీకొట్టడం కంటే, వారి రాజకీయ పునాదులను కదిలించేలా ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ వేస్తున్న అడుగులు క్షేత్రస్థాయి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. నిన్నటివరకు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుముకగా నిలిచిన స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులను కాంగ్రెస్ స్థానిక నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు వ్యూహాత్మకంగా ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా గజ్వేల్ -- సిద్దిపేట సరిహద్దు ప్రాంతాల్లో ఈ సైలెంట్ ఆపరేషన్ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. టాప్ లీడర్లు హైదరాబాద్‌లోనే ఉంటూ అసెంబ్లీ లేదా మీడియా వేదికలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం హస్తం శ్రేణులు గ్రామాల్లోని కరడుగట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారు. గజ్వేల్ లాంటి ప్రాంతాల్లో క్యాంప్ ఆఫీసుల చుట్టూ జరుగుతున్న రాజకీయ ఘర్షణలు, నిరసనలు కేవలం పైకి కనిపిస్తున్న ఊహాగానాలు కావు, లోపల మాత్రం కాంగ్రెస్ తన పనిని నిశ్శబ్దంగా పూర్తి చేస్తోంది. పదేళ్ల కాలంలో గ్రామాల్లో పనులు చేసి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మాజీ సర్పంచులు, నిధుల కొరతతో సతమతమవుతున్న ప్రజాప్రతినిధుల బలహీనతలను కాంగ్రెస్ పార్టీ క్యాష్ చేసుకుంటోంది. వారికి అధికార పార్టీ అండగా ఉంటుందనే భరోసా ఇస్తూనే, మూడు రకాల ఆకర్షణీయమైన వ్యూహాలను అమలు చేస్తోంది. త్వరలో రాబోయే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని లేదంటే స్థానిక నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇస్తోంది. దారికి రాకపోతే అధికార బలంతో స్థానిక పనులకు బ్రేకులు వేయడం లేదా సహకరించడం ద్వారా ఒత్తిడి పెంచుతోంది. బీఆర్ఎస్ అధిష్టానానికి, స్థానిక లీడర్లకు మధ్య గ్యాప్ పెంచేందుకు ప్రయత్నిస్తోంది. మీరు ప్రతిపక్ష పార్టీలో ఉంటే మీకు లాభం ఉండదని, అధికార పార్టీలోకి వస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమనే ప్రచారాన్ని క్యాడర్‌లోకి బలంగా తీసుకెళ్తున్నారు. దీనివల్ల నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఇంకా బలంగానే కనిపిస్తున్నా, లోపలి గ్రామాల్లో మాత్రం గులాబీ కోటల పునాదులు నెమ్మదిగా బలహీనపడుతున్నాయి. అయితే, ఈ ఆపరేషన్ కాంగ్రెస్‌కు అంత సులభంగా ఏకపక్షంగా సాగడం లేదు. సిద్దిపేట, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో హరీష్ రావు లాంటి సీనియర్ నేతలు రంగంలోకి దిగి డ్యామేజ్ కంట్రోల్ చర్యలు చేపట్టారు. అలకపాన్పు ఎక్కిన కార్యకర్తలను బుజ్జగించేందుకు, పార్టీ మారిన వారిని తిరిగి సొంత గూటికి చేర్చుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల వైఫల్యాలను, స్థానిక సంస్థల ఎన్నికల జాప్యాన్ని ఎండగడుతూ రివర్స్ అటాక్ చేస్తున్నారు. అయినప్పటికీ, అధికార పార్టీ విసిరిన వ్యూహాత్మక వలయం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో కొంత అయోమయం స్పష్టంగా కనిపిస్తోంది. కంచుకోటలుగా భావించే ఈ మూడు నియోజకవర్గాల్లో క్యాడర్ గనుక చెల్లాచెదురైతే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. గులాబీ నేతలకు హస్తం పార్టీ వేస్తున్న ఈ గాలం కేవలం తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం లేదా కేవలం స్థానిక లీడర్లను మార్చడం కోసం మాత్రమే కాదు. దీని వెనుక పెద్ద స్కెచ్ ఉంది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను రాష్ట్రస్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టకుండా, వారి వారి సొంత నియోజకవర్గాల రక్షణలోనే నిరంతరం బిజీగా ఉంచాలనేది కాంగ్రెస్ మార్క్ హైలెవల్ పొలిటికల్ స్ట్రాటజీ. తద్వారా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వంపై వారి దూకుడును తగ్గించవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మైండ్ గేమ్‌లో అధికార కాంగ్రెస్ ఎంతవరకు సఫలమవుతుంది, గులాబీ త్రయం తమ కంచుకోటలను ఎలా కాపాడుకుంటుంది అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

అధిష్టానం ఎంట్రీతో ఈటెల, బండి మధ్య గ్యాప్ తగ్గినట్టేనా

హైదరాబాద్, జూలై 20 పెన్ పవర్:
తెలంగాణ భారతీయ జనతా పార్టీలో గత కొంతకాలంగా సాగుతున్న అంతర్గత విభేదాలకు చెక్ పెట్టేందుకు అధిష్టానం ప్రయత్నాలు షురూ చేసింది. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్న ఢిల్లీ పెద్దలు, ఇక్కడి కీలక నేతల మధ్య ఉన్న కోల్డ్ వార్‌ను ముగించడానికి నేరుగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగానే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఆధ్వర్యంలో బుజ్జగింపుల పర్వం ఊపందుకుంది. రాష్ట్ర బీజేపీలో అత్యంత కీలక నేతలుగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైకమాండ్ గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఈ వివాదాన్ని వీలైనంత త్వరగా సమసిపోయేలా చూడాలనే పట్టుదలతో అధిష్టానం ఉంది. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లిన అభయ్ పాటిల్, రాత్రి పొద్దుపోయే వరకు ఆయనతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత పరిణామాలు, విభేదాలకు గల కారణాలపై ఆయనతో ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్‌తో కూడా అభయ్ పాటిల్ భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ నివాసంలో ఒక కీలకమైన భేటీ జరగనుంది. ఈ మీటింగ్‌కు ఈటల రాజేందర్, బండి సంజయ్ ఇద్దరూ హాజరుకానుండటం విశేషం. అధిష్టానం దూతలుగా వచ్చిన సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ సమక్షంలో ఈ ఇద్దరు నేతలను ఒకే వేదికపైకి తెచ్చి, వారి మధ్య ఉన్న మనస్పర్థలను తొలగించడానికి లక్ష్మణ్ నివాసం వేదిక కాబోతోంది. కొంతకాలంగా ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య సఖ్యత లోపించిన విషయం బహిరంగ రహస్యమే. ఒకరిపై మరొకరు పరోక్షంగా పలుమార్లు విమర్శలు, ఆరోపణలు గుప్పించుకున్నారు. ఈ ఇద్దరు నేతల మధ్య ఉన్న

గ్యాప్ చూసి వారి అనుచరులు, అభిమానులు మరింత రెచ్చిపోయారు. పలు సందర్భాల్లో పరస్పర వ్యతిరేక పోస్టర్లు, ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. ఈ అంతర్గత విభేదాలు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేశాయి. ఈ ప్రభావం పార్టీ బలోపేతంపై పడుతుండటంతో ఢిల్లీ పెద్దలు అలర్ట్ అయ్యారు. ఇటీవల తెలంగాణలో పర్యటించిన జాతీయ నేతలు నితిన్ నబీన్, జేపీ నడ్డా సైతం రాష్ట్ర నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి, పార్టీ ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని కరాఖండిగా చెప్పారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు రాకపోవడంతో, ఇప్పుడు నేరుగా హైకమాండ్ రాయబారాన్ని పంపింది.
తెలంగాణలో అధికారమే పరమావధిగా భావిస్తున్న బీజేపీకి ఈ ఇద్దరు నేతలూ అత్యంత అవసరం. బండి సంజయ్ మాస్ లీడర్‌షిప్, కేడర్‌లో ఉన్న ఫాలోయింగ్ పార్టీకి ఎంత ప్లస్సో.. ఈటల రాజేందర్ రాజకీయ అనుభవం, వ్యూహాలు అంతే ముఖ్యం. వీరిలో ఏ ఒక్కరిని వదులుకోవడానికి లేదా దూరం పెట్టడానికి అధిష్టానం సిద్ధంగా లేదు. ఇద్దరి బలాలు కలిస్తేనే తెలంగాణలో
అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని ఢిల్లీ పెద్దలు బలంగా నమ్ముతున్నారు. అధిష్టానం నేరుగా రంగంలోకి దిగడం, ఇవాళ ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు కీలక నేతలు ముఖాముఖి కూర్చోనుండటంతో ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ చర్చల తర్వాతైనా ఇద్దరు నేతలు తమ పంతాలను వీడి, పార్టీ కోసం కలిసి నడుస్తారని సాధారణ కార్యకర్తలు, క్యాడర్ ఆశగా ఎదురుచూస్తున్నారు. మరి ఢిల్లీ పెద్దల బుజ్జగింపులు ఎంతవరకు పారుతాయో, టీ బీజేపీలో ఈ అంతర్గత సంక్షోభానికి తెరపడుతుందో లేదో చూడాలి.

రేషన్ కార్డుదారులకు మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. పేదల ఆహార భద్రత కోసం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. కేంద్ర ఆదేశాలతో తెలంగాణ పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆగస్టు1 నుంచి లబ్ధిదారులకు ఈ మూడు నెలల బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

పారదర్శకంగా పోలీస్ ఉద్యోగాల భర్తీ: డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ పెన్ పవర్: పోలీస్ ఉద్యోగాల భర్తీని పారదర్శకంగా నిర్వహిస్తామని డీజీపీ సీవీ ఆనంద్, తెలిపారు. పోలీస్ ట్రైనింగ్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా పోలీస్ రిక్రూట్మెం ట్ బోర్డు పనితీరు నియామకాల పురో గతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ పోలీస్ రిక్రూట్ మెంట్‌లో ఇప్పటి వరకు ఒక్క పేపర్ లీక్ కూడా జరగలేద ని, ఇదే బోర్డు విశ్వస నీయతకు నిదర్శన మని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. పోలీసు నియామకాల్లో పార దర్శ కతకు తెలంగాణ ఆదర్శమని కొనియాడారు. సీసీటీఎన్ఎస్ జాతీయ స్థాయి బెంచ్‌మార్క్‌ను చేరుకోవాలంటే అందరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కొత్త టెక్నాలజీ వాడాలనీ, అన్ని యాప్‌లూ వినియోగించాలని చెప్పారు. రిక్రూట్మెంట్ ప్రక్రియను పారదర్శ కంగా, నిష్పాక్షికంగా, విశ్వసనీయంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 2022-23లో రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పోలీస్ నియామక ప్రక్రియ ద్వారా 16, 654 పోస్టులు భర్తీ చేసినట్టు వెల్లడిం చారు. ఇప్పటివరకు జరిగిన నియామకా ల్లో 95 శాతం కానిస్టే బుల్ పోస్టులు, 5 శాతం ఎస్ఐ పోస్టులే ఉన్నట్టు వివరించారు. 2025 నోటిఫికేషన్ల లో 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, 1,743 డ్రైవర్ ఆపరే టర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగు తోందని తెలిపారు. తొలిసారిగా నిర్వహిం చిన ఫింగర్ ప్రింట్ అండ్ ఫోరెన్సిక్ పోస్టుల నియామకం లో 60 పోస్టులకు 57 మంది ఎంపికయ్యా రని వివరించారు. రిక్రూట్మెంట్‌లో 33 శాతం రిజర్వేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం, ఆరఎఫ్ఐడీ టెక్నాలజీ, మొబైల్ అండ్ ఈ-మెయిల్ రిజిస్ట్రేషన్, నెగెటివ్ మార్కింగ్ వంటి సంస్కరణలను వివరించారు. పోలీస్ ట్రైనింగ్, పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ ఆధునికీకరణపై డీజీపీ పలు కీలక సూచనలు చేశారు. సమావేశంలో నూతన కమ్యూనికేషన్ సెట్లను డీజీపీ సి.వి. ఆనంద్ ఆవిష్కరించారు.

కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం: ప్రత్యేకాధికారి పి. కవిత

హైదరాబాద్ పెన్ పవర్: రామడుగు మండలం వెధిర కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లో కోనరావుపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లో 6వ తరగతిలో -18 సీట్లు 7వ తరగతిలో-15 సీట్లు 9వ తరగతిలో-03 సీట్లు మొదటి సంవత్సరం(సిఇసి) గ్రూపులో-19 సీట్లు మొదటి సంవత్సరం (ఎంపీహెచ్డబ్ల్యు) గ్రూపులో-10 సీట్లు ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థినుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి పి. కవిత తెలిపారు. ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పూర్తి వివరాల కొరకు వెదిర కోనరావుపేటలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సంప్రదించగలరని ప్రత్యేక అధికారి పి. కవిత పేర్కొన్నారు.

మూడేళ్లుగా ఎదురు చూపులు
ఎస్సీ హాస్టల్స్ సిబ్బందికి అందని వేతనాలు
ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి

హైదరాబాద్ పెన్ పవర్: పెద్దపల్లి జిల్లాలోని ఎస్సీ ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ వసతి గృహాల్లో పగలు,రాత్రి వేళల్లో సేవనందిస్తున్న వాచ్మెన్లు, పారిశుద్ధ్య సిబ్బందికి చెల్లిం చాల్సిన బిల్లులు గత మూడే ళ్లుగా చెల్లించకుండా నిలిపి వేయడంపై గణ శ్రీ సాయి సర్వీసెస్ అధినేత శ్రీనివాస్ నాగపురి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాగపురి మాట్లాడు తూ 2023-24, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు గాను నిరంతరం సేవలు అందించిన ఏజెన్సీలకు రావాల్సిన నిధులు రాకపోవడంతో,జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులకు ఎన్నిసార్లు విజ్ఞాపన పత్రాలు సమర్పించి నా అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్ప బిల్లుల మంజూరుకు ఎలాంటి చొరవ చూపడం లేదని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. పక్కనే ఉన్న కరీంనగర్, మంచిర్యాల జిల్లాల్లో ఇదే శాఖ పరిధిలోని బిల్లులు 2025 జూలై నాటికే పూర్తిగా మంజూరైనప్పటికీ, పెద్దపల్లి జిల్లాలోనే మూడేళ్లు గా బిల్లులు ఆగిపోవడంతో సిబ్బంది తీవ్ర ఆర్థిక ఇబ్బందు లు ఎదుర్కొంటూ కుటుంబాల ను పోషించడం భారంగా మారి కన్నీరుమున్నీరవుతు న్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పక్క జిల్లాల్లో నిధులు సజావుగా విడుద లవుతున్నప్పుడు ఇక్కడే ఈ తరహా నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించిన శ్రీనివాస్ నాగపురి, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణమే పెండింగ్ బిల్లులను పరిశీలించి వాటిని వెంటనే మంజూరు చేసేలా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించాలని కోరినట్లు తెలిపారు.

దేశరాజుపల్లిలో డంపింగ్ యార్డు వద్దు
జై భీం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా

హైదరాబాద్ పెన్ పవర్:
కొత్తపల్లి మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా సోమవారం జై భీం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా. కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి మున్సిపాలిటీకి చెందిన చెత్త వాహనాలు ప్రతిరోజూ గ్రామంలోని డంపింగ్ యార్డులో చెత్తను వేయడం వల్ల దుర్వాసన, కాలుష్యం ఏర్పడి చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు. ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామంలో చెత్త డంపింగ్ నిలిపివేసి ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లపెల్లి లచ్చయ్య, ఉపసర్పంచ్ ఎం.డి. హైదర్, వార్డు సభ్యులు, జై భీం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తూరి అరవింద్, గ్రామ యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

గులాబీ గ్రాఫ్ పెరిగినట్టేనా

హైదరాబాద్, జూలై 20, పెన్ పవర్: బీఆర్ఎస్ క్రమంగా తెలంగాణ లో పుంజుకుంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే బీఆర్ఎస్ ఎఫెన్స్ లో వెళుతుంది. రేవంత్ ప్రభుత్వంపై విరుచుకుపడుతుంది. అవినీతి ఆరోపణలతో హామీలు అమలు చేయకపోవడంపై నిలదీస్తుంది. వర్గాల వారీగా విభజించుకుని వారిని సమీకరించడంలో కొంత గులాబీ పార్టీ సక్సెస్ అయినట్లు కనిపిస్తుంది. ప్రధానంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని కారు పార్టీ హస్తానికి గురిపెట్టింది. దీంతో బీఆర్ఎస్ క్రమంగా బలం పెంచకుంటుందన్న వార్తలు అధికార పార్టీలో కలవరం రేపుతున్నాయి. ఈ విషయాన్ని సొంత పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి చెప్పారు. బీఆర్ఎస్ బలం పుంజుకుంటుందని చెప్పిన ఆమె తర్వాత మాట మార్చినప్పటికీ మీడియాలో అన్న వార్తలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రేణుక అన్నారని కాదు కానీ.. ప్రతి ఒక్క కాంగ్రెస్ నేత మనసులో కూడా ఇదే అభిప్రాయం ఉన్నట్లు కనపడుతుంది. కేసీఆర్ బయటకు రాకపోయినా.. ఆయనపై చేసే వ్యక్తిగత విమర్శలు కూడా ఆ పార్టీకి సానుభూతిని తెచ్చి పెడుతున్నాయంటున్నారు. దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వరసగా బీఆర్ఎస్ సమావేశాలను నిర్వహిస్తూ ప్రజలను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తుంది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు జనంలోకి వెళుతున్నారు. వారి పర్యటనలకు కూడా మంచి స్పందన లభిస్తుంది. ఇచ్చిన హామీలను కొన్నింటిని అమలు చేసినా, అమలు చేయని వాటిని ఫోకస్ చేయడంతో పాటు ఎరువులు కొరత, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, కరువు ఇలాంటి విషయాలన్నీ తమకు అనుకూలంగా మలచుకోవడంలో బీఆర్ఎస్ సక్సెస్ అయిందనే చెప్పాలి. నిన్న జరిగిన యువ సంగ్రామ సదస్సు కూడా విజయవంతం కావడంతో పాటు కేటీఆర్ తాము అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దుకుంటామని హుందాగా వ్యవహరించడం కూడా ఒకింత జనానికి చేరువ చేసిందనే చెప్పాలి. మొత్తం మీద కాంగ్రెస్ అప్రతమత్తం కాకుంటే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం అంత సులువు కాదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి

చామకూర దారెటు..

హైదరాబాద్, జూలై 20, పెన్ పవర్: తెలుగు నేల రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వ్యవహారం ఎప్పటికప్పుడు హాట్ కేక్ మాదిరిగానే ఉంటోంది. ఏ పార్టీలో ఉన్నా తనదైన మార్కు రాజకీయం, తనదైన మార్కు వ్యవహారంతో మల్లారెడ్డి నిత్యం వార్తల్లోనే ఉంటారు. ప్రస్తుతం బీఆర్ఎస్ లో కొనసాగుతున్న మల్లారెడ్డి... ఆ పార్టీని వీడతారంటూ చాన్నాళ్లుగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే ఎప్పటికప్పుడు ఆ వాదనలను కొట్టిపారేస్తున్న సీనియర్ నేత... మళ్లీ అవే వార్తలకు బలం చేకూర్చేలా వ్యవహారం నడుపుతూ నిజంగానే వార్తల్లో నేతగా నిలుస్తున్నారు. తాజాగా మల్లారెడ్డికి చెందిన ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోను చూస్తుంటే... ఇక మల్లారెడ్డి బీఆర్ఎస్ కు వీడ్కోలు పలికినట్టేనన్న వాదనలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.తెలంగాణ రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన ఈ వీడియోలో మల్లారెడ్డి అసలు నోరు మెదపనే లేదు. ఈ వీడియోలో కాంగ్రెస్ పార్టీ కీలక నేత, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్నారు. తన ప్రసంగంలో ఆయన బీఆర్ఎస్ అదినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుపై ఓ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కేసీఆర్ పై ఆ రేంజిలో రేవంత్ విమర్శలు గుప్పిస్తూ ఉంటే...ఆయనకు వెనుక...ఆయనకు దాదాపుగా ఆనుకుని కూర్చుని ఉన్న మల్లారెడ్డి... తన ముఖంలో ఏ భావమూ కనిపించనీయకుండా అలా కూర్చుండి కనిపిస్తున్నారు..కేసీఆర్ బీఆర్ఎస్ అధినేతనే కదా. అంతేనా... టీడీపీ నుంచి బీఆర్ఎస్ లోకి రాగానే ఎమ్మెల్యే టికెట్ తో పాటుగా ఏకంగా మంత్రి పదవి ఇచ్చి... మల్లారెడ్డికి రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యం కల్పించిన నేతగా కేసీఆర్ ఉన్నారు. అలాంటి కేసీఆర్ ను రేవంత్ రెడ్డి ఓ రేంజి విమర్శలు సంధిస్తూ ఉంటే... మాట మాత్రంగా కూడా స్పందించని మల్లారెడ్డి...కనీసం అక్కడి నుంచి వెళ్లిపోవాలన్న సోయి కూడా లేకుండా కూర్చుని ఉన్నారంటూ బీఆర్ఎస్ నేతలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ కేసీఆర్ ను ఆ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్న వేదికపై అలా కూర్చుని ఉండిపోయిన మల్లారెడ్డి తీరు చూస్తుంటే... ఆయన గులాబీ పార్టీ నుంచి వేరు పడాలని దాదాపుగా నిర్ణయించుకున్నారన్న సరికొత్త విశ్లేషణలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ లోకో, లేదంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలోనో మల్లారెడ్డి చేరిపోయే దిశగా సాగుతున్నారన్న వార్తలు నిత్యం వినిపిస్తూనే ఉన్నాయి. అంతేకాకుండా తనతో ఉప్పూనిప్పులా వ్యవహరించిన రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో మల్లారెడ్డి అలా స్పందన లేకుండా కూర్చున్నారంటే.. ఆయన బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిపోవాలని నిర్ణయించుకున్నట్టేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

ఆర్మూరులో వేడెక్కిన రాజకీయం

నిజామాబాద్, జూలై 20 పెన్ పవర్:
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య జరుగుతున్న తీవ్రమైన మాటల యుద్ధం సోషల్ మీడియా వేదికల నుండి క్షేత్రస్థాయి వరకు పాకింది. ముఖ్యంగా అంకాపూర్ గ్రామంలో బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి నివాసం వద్ద కాంగ్రెస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎమ్మెల్యేను నిలదీసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా, తన ఇంటి వద్దే వేచి ఉంటానని రాకేశ్ రెడ్డి సవాల్ విసరడంతో ఉద్రిక్తత పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక రాజకీయాలు రసవత్తరంగా మారాయి. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసేందుకు ఆర్మూర్ పట్టణం, అంకాపూర్ గ్రామంలో 144 సెక్షన్ విధించారు. ఇరువర్గాల కార్యకర్తల పోటాపోటీ ఆందోళనలతో ఆర్మూర్ నియోజకవర్గం మొత్తం ఒక్కసారిగా అట్టుడికిపోతోంది. శాంతి భద్రతల దృష్ట్యా భారీ పోలీసు బలగాలను మోహరించారు.రాజకీయ వివాదానికి ప్రధాన కారణం ప్రభుత్వ పథకాలపై జరుగుతున్న విమర్శలే. సీఎం రేవంత్ రెడ్డి యువతులకు ఎలక్ట్రిక్ బైక్‌లు ఇస్తామని ప్రకటించి మోసం చేశారని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు చాలా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి గతంలో ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నేతలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. తాను గెలిస్తే ప్రతి గ్రామంలో రూపాయికే వైద్యం అందుబాటులో ఉంచుతానని, సొంత డబ్బుతో ప్రతి ఊరిలోనూ ఇళ్లు నిర్మిస్తానని ఆయన ప్రజలకు వాగ్దానం చేశారు. అయితే అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా ఆ హామీలు నెరవేర్చలేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ చర్చ ఇప్పుడు ఆర్మూర్ ప్రజల్లో పెద్ద ఎత్తున హాట్ టాపిక్‌గా మారింది. రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి.సోషల్ మీడియాలో కూడా ఈ రాజకీయ పోరు తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలు, విమర్శలతో పోస్టు పెడుతున్నారు. ఆన్‌లైన్ వేదికలపై జరుగుతున్న ఈ రచ్చ క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలను మరింత రెచ్చగొడుతోంది. అంకాపూర్ ఎమ్మెల్యే నివాసం ముట్టడి ఘటన తర్వాత ఆర్మూర్ ప్రధాన కూడళ్లలో ఉద్రిక్తత నెలకొంది. నిరసనలు, ప్రతి నిరసనలతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజకీయ నాయకుల మాటలతో కార్యకర్తలు వీధుల్లోకి రావడం, రాళ్లు రువ్వుకోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కంటే రాజకీయ కక్షలు, ప్రతీకారాలతోనే సమయం వృథా అవుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనిని నివారించేందుకు రాజకీయ పార్టీలు సంయమనం పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.పోలీసు యంత్రాంగం పరిస్థితిని గమనిస్తూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఆర్మూర్ పట్టణంలోని కీలక ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తూ, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఆందోళనలు తీవ్రతరం అవుతాయనే సమాచారంతో పోలీస్ ఉన్నతాధికారులు ఆర్మూర్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి ఊరేగింపులు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద భారీగా బలగాలను ఉంచారు. ఒకవేళ పరిస్థితి చేజారితే అదనపు బలగాలను దించేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు. శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఆర్మూర్ ప్రజల్లో కొంతలో కొంత ఊరట కలిగిస్తున్నాయి. అధికార యంత్రాంగం కూడా ఈ వ్యవహారంలో చొరవ తీసుకుని రాజకీయ నాయకులతో చర్చలు జరపాల్సిన పరిస్థితి వచ్చింది.

త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్య

హైదరాబాద్ పెన్ పవర్:
త్రిపుర రాష్ట్ర డీజీపీగా విధులు నిర్వహిస్తున్న అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయారు. అగర్తలాలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయన తన సర్వీస్ తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. త్రిపుర రాష్ట్రంలో సోమవారం ఉదయం ఒక షాకింగ్ ఘటన వెలుగు చూసింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయారు.
సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడికి చేరుకొని ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అగర్తలాలోని జీబీ ఆసుపత్రికి తరలించారు.రాష్ట్ర అత్యున్నత పోలీసు అధికారి ఇలా ఆకస్మికంగా, విషాదకర రీతిలో మరణించడం త్రిపుర పరిపాలన, శాంతిభద్రతల వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించడంతో. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు..
అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్యకు గల తక్షణ కారణాలపై ఆరా తీస్తున్నారు. అలాగే సీనియర్ ఐపీఎస్ అధికారి మరణానికి దారితీసిన పరిస్థితులను నిర్ధారించడానికి ప్రభుత్వం త్వరలోనే ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా త్రిపుర కేడర్‌కు చెందిన 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన అనురాగ్ ధంకర్, 2025 మే నెలలో త్రిపుర డీజీపీ బాధ్యతలు స్వీకరించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

తులం బంగారం పంచాయితీ: కాంగ్రెస్ నేతలకు 'మెడ' మీద ముప్పు తెచ్చిన ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రాజకీయాల్లో ఎన్నికల హామీలు.. వాటి చుట్టూ తిరిగే విమర్శలు ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటాయి. కానీ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ శాసనసభ్యుడు, బీజేపీ నేత పైడి రాకేశ్ రెడ్డి మాత్రం ఈ విమర్శల డోస్ కాస్త గట్టిగానే పెంచారు. "కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసింది కాబట్టి.. ఆ పార్టీ నాయకులు కనిపిస్తే వాళ్ల మెడల్లో ఉన్న బంగారమే లాగేసుకోండి" అంటూ ఆయన ఇచ్చిన క్రేజీ సలహా ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం సలహా ఇచ్చి ఊరుకుంటే ఆయన రాజకీయ నాయకుడు ఎందుకవుతారు? "బంగారం లాక్కునే ప్రాసెస్ లో పోలీసులు కేసులు పెట్టినా భయపడకండి.. నేను చూసుకుంటా మీకు అండగా ఉంటా" అంటూ అభయహస్తం కూడా ఇచ్చేశారు. ఉచితంగా తులం బంగారం వస్తుందని ఆశపడ్డ మహిళల సంగతి పక్కన పెడితే, ఎమ్మెల్యే గారి స్టేట్‌మెంట్‌తో కాంగ్రెస్ లీడర్లు మాత్రం తమ మెడల్లో చైన్లు జాగ్రత్తగా దాచుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

శృతిమించిన హామీల యుద్ధం

రాకేశ్ రెడ్డి గారి డైలాగులు పేలడమే ఆలస్యం.. కాంగ్రెస్ శ్రేణులు తల పట్టుకున్నంత పనిచేశాయి. "సరే మా సంగతి పక్కన పెట్టండి.. ఎన్నికల టైంలో మీరు ఇచ్చిన 'రూపాయికే వైద్యం', సొంత పైసలతో ఇళ్ల నిర్మాణం హామీలు ఎక్కడికి పోయాయి సార్?" అంటూ సోషల్ మీడియా వేదికగా రివర్స్ ఎటాక్ మొదలుపెట్టాయి. అయితే ఎమ్మెల్యే గారు మాత్రం తగ్గడం లేదు. "ప్రభుత్వం ఇళ్లు కట్టివ్వకపోయినా నా సొంత ఖర్చులతో, కేంద్ర వాటాతో కలిపి ఇప్పటికే 3,000 ఇళ్లు పూర్తి చేశా" అంటూ తన మార్క్ డెవలప్‌మెంట్‌ను గట్టిగానే వినిపిస్తున్నారు. మాట నిలబెట్టుకోవడంలో తనే నెంబర్ వన్ అని ఆయన చెప్పుకుంటుంటే.. కాంగ్రెస్ మాత్రం అదంతా ఉత్తిదే అని కొట్టిపారేస్తోంది.

'చలో అంకాపూర్'.. ఆర్మూర్‌లో ఫుల్ టెన్షన్

ఈ 'గోల్డ్ మెడల్' వివాదం కాస్తా ముదిరి పాకాన పడటంతో ఎమ్మెల్యే గారిని నేరుగా నిలదీసేందుకు కాంగ్రెస్ పార్టీ "చలో అంకాపూర్" కార్యక్రమానికి పిలుపునిచ్చింది. దీంతో ఆర్మూర్ పాలిటిక్స్ ఒక్కసారిగా హీటెక్కాయి. ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించి, ఆయన ఇచ్చిన హామీల లొసుగులను బయటపెట్టేందుకు కాంగ్రెస్ రెడీ అయ్యింది. దీనికి బీజేపీ కౌంటర్ ఇస్తోంది. మా ఎమ్మెల్యే జోలికి వస్తే ఊరుకునేది లేదు.. కాంగ్రెస్ యాక్షన్‌కు మాది డబుల్ రియాక్షన్ అంటూ క్యాడర్ అలర్ట్ అయ్యింది.ప్రస్తుతం ఆర్మూర్‌లో పరిస్థితి ఎలా ఉందంటే.. ఎప్పుడు ఏం జరుగుతుందో అర్థం కాని గందరగోళం. శాంతిభద్రతలు చేజారిపోకుండా ఉండేందుకు పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ ముఠాలు బాహాబాహీకి దిగకుండా ఉండేందుకు ముందస్తు అరెస్టుల పర్వం కూడా మొదలైంది.ఎన్నికల హామీల అమలు కోసం ప్రజలు కొట్లాడటం చూశాం కానీ ఇలా "నాయకుల మెడల్లో బంగారాలు లాగేసుకోండి" అని ఓ ఎమ్మెల్యేనే లైసెన్స్ ఇవ్వడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. మరి ఈ 'గోల్డ్ వార్' లో కాంగ్రెస్ నేతలు తమ మెడలోని బంగారాన్ని ఎలా కాపాడుకుంటారు? ఈ "చలో అంకాపూర్" రచ్చ ఎంతవరకు వెళ్తుంది? అనేది ఆర్మూర్ రాజకీయాల్లో ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న..

ప్రసంగాలతో ఇచ్చిపడేస్తున్న రేవంత్..

హైదరాబాద్, జూలై 20 పెన్ పవర్:
తెలంగాణా రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తూ దూసుకుపోతున్నారు. ఆయన మాటలు పదునైన ఆయుధాల్లా ప్రత్యర్థుల గుండెల్లోకి దిగిపోతుంటాయి. ఎదుటి వారు తనపై ఎన్ని విమర్శలు సంధించినా, తనదైన వాక్చాతుర్యంతో వాటిని తిప్పికొట్టడంలో ఆయన దిట్ట. రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద సానుకూలత ఆయన ప్రసంగ శైలి. ఎంతటి క్లిష్టమైన అంశాన్నైనా సామాన్యులకు అర్థమయ్యే రీతిలో, ఆకట్టుకునేలా చెప్పడం ఆయన ప్రత్యేకత. తెలంగాణా యాస, మాండలీకాలు, సందర్భోచిత సామెతలను జోడించి ప్రసంగించడంతో జనం ఆయన మాటలకు బాగా కనెక్ట్ అవుతున్నారు. ప్రత్యర్థులపై విమర్శలు చేసేటప్పుడు ఆయన చూపే చొరవ, వ్యూహాత్మకమైన దూకుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏ విషయంపైనైనా విపక్షాల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు ఆయన ఇచ్చే సమాధానాలు వినడానికి ఆసక్తికరంగా ఉండి, జనంలోకి బలంగా దూసుకెళ్తున్నాయి.రాజకీయ మైదానంలో తనను ఎదుర్కొనే ధీటైన వక్త ఎవరూ లేకపోవడం రేవంత్ రెడ్డికి పెద్ద అడ్వాంటేజ్. తనను విమర్శించే వారి ఫ్లాష్‌బ్యాక్‌ను బయటకు తీసి, జరిగిన పాత విషయాలను ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచడం ఆయన అలవాటు. దీనివల్ల ప్రత్యర్థులు డిఫెన్సివ్‌లో పడుతున్నారు. గతంలో జరిగిన నియామకాలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలను ఆయన తనదైన శైలిలో గుర్తు చేస్తున్నారు. ఎవరైనా తనపై విమర్శలు చేస్తే, దానికి అంతకు పదింతలు ఘాటైన కౌంటర్ ఇవ్వడం రేవంత్ స్టైల్. తన ప్రసంగాల ద్వారా ప్రత్యర్థుల బలహీనతలను ఎత్తిచూపుతూ, వారిని అపహాస్యం చేయడం ఆయన వ్యూహం. ఈ మాటల యుద్ధంలో రేవంత్ రెడ్డిని ఓడించడం బీఆర్ఎస్ నేతలకు సవాలుగా మారింది. ఏ విమర్శకైనా ఆయన రెడీగానే ఉండటం, కౌంటర్ అటాక్‌లో ఆయన చూపే వేగం రాజకీయాల్లో ఆయనను అగ్రస్థానంలో నిలబెడుతోందిఇటీవల నిరుద్యోగ సమస్యపై బీఆర్ఎస్ చేసిన ఆందోళనలను రేవంత్ రెడ్డి తన మాటలతో తిప్పికొట్టారు. ముఖ్యంగా కేటీఆర్ విమర్శలకు ఆయన ఇచ్చిన జవాబు స్ట్రాంగ్ డోస్‌గా మారింది. కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన ఉద్యోగాల కేటాయింపులను ఆయన పక్కా డేటాతో బయటపెట్టారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత, వినోద్ కుమార్ వంటి కుటుంబ సభ్యులకే కేసీఆర్ ఉద్యోగాలు ఇచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారికి సైతం పదవులు కట్టబెట్టి, నియామక పత్రాలు ఇవ్వడం కేసీఆర్ కే చెల్లిందని ఆయన విమర్శించారు. పదేళ్ల కాలంలో నాలుగు కోట్ల తెలంగాణా ప్రజలు కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు ఇస్తే, వారు సమాజానికి ఏమిచ్చారని రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఈ వాదన జనాల్లోకి బాగా వెళ్లడంతో, బీఆర్ఎస్ వాదనలు నీరుగారిపోయాయి. ఆయన ప్రయోగించే ఈ రకమైన రాజకీయ అస్త్రాలు ప్రత్యర్థులను పూర్తిగా ఇరకాటంలోకి నెడుతున్నాయిరేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా కష్టమేనన్న భావన బలపడుతోంది. మాట్లాడితే చాలు, గత ప్రభుత్వ అక్రమాలను, తప్పులను ఆయన ప్రస్తావిస్తూ ప్రత్యర్థుల నోరు మూయిస్తున్నారు. ఆయన చేసే ప్రసంగాల్లో ఉండే స్పష్టత, వాస్తవికత ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. రేవంత్ రెడ్డి ఏమి చెప్పినా, ఏ విమర్శ చేసినా అది బలంగా ప్రజలకు అర్థమవుతోంది. కేసీఆర్ కుటుంబానికి మళ్ళీ అధికారం దక్కనిచ్చే ప్రసక్తే లేదని ఆయన చేస్తున్న భీషణ ప్రతిజ్ఞలు గులాబీ పార్టీకి నిద్రలేని రాత్రులను మిగుల్చుతున్నాయి. మాటకారి వ్యూహకర్త అయిన రేవంత్ రెడ్డితో పెట్టుకోవడం అంటే ప్రమాదకరమని ఆ పార్టీ నేతలు గుర్తిస్తున్నారు. ఆయనతో గొడవ పెట్టుకుంటే ఒకటి అని నాలుగు మాటలు వినక తప్పదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

రాజకీయ వ్యూహాల్లో రేవంత్ రెడ్డి వేస్తున్న ప్రతి అడుగు బీఆర్ఎస్ పార్టీ పునాదులను కదిలిస్తోంది.రేవంత్ రెడ్డి రాజకీయ శైలిని గమనిస్తే, ఆయన ఎంతటి తీవ్రమైన విమర్శలనైనా సులువుగా స్వీకరిస్తారని అర్థమవుతుంది. ఆ విమర్శల నుండి పాఠాలు నేర్చుకుంటూనే, తిరుగుదాడి చేయడంలో ఆయన చూపే వేగం ప్రత్యర్థులను ఆశ్చర్యపరుస్తోంది. ఒక ముఖ్యమంత్రిగా తన బాధ్యతలను నెరవేరుస్తూనే, మరోవైపు రాజకీయ ప్రత్యర్థులకు సరైన సమాధానం ఇవ్వడంలో ఆయన రాజీ పడటం లేదు. జనాల్లోకి వెళ్ళడానికి ఆయన ఎంచుకున్న మార్గం, మాట్లాడే పద్ధతి ఈ తరం ఓటర్లకు చాలా బాగా అర్థమవుతోంది. సోషల్ మీడియాలో కూడా ఆయన మాటలు ట్రెండింగ్‌లో ఉంటాయి. ఇలా రేవంత్ రెడ్డి ఒకవైపు అభివృద్ధి పనులు చేస్తూనే, ఇంకోవైపు రాజకీయ ప్రత్యర్థులపై తన మాటల వేటను కొనసాగిస్తున్నారు. రేవంత్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోవడం, ఆయన వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పడం అనేది విపక్షాలకు రాబోయే రోజుల్లో మరింత కష్టతరంగా మారే అవకాశం పుష్కలంగా ఉంది.

దోబూచులాడుతున్న వరుణుడు

విజయవాడ, జూలై 20, పెన్ పవర్:
వరుణుడు దోబూచులాడుతున్నాడు. అప్పుడప్పుడూ వర్షాలు కురుస్తున్నా కూడా సాధారణం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదైంది. ఏపీలో జూలై నెలలో 35 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఐదు జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాలలో లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మరోవైపు ఎల్ నినో కారణంగా దేశంలోని అనేక ప్రాంతాలలో తక్కువ వర్షపాతం నమోదౌతుందని ఐఎండీ అధికారులు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరుణుడు దోబూచులాడుతున్నాడు. దీంతో ఏపీలో లోటు వర్షపాతం 35 శాతానికి పెరిగింది. రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లాలలో దాదాపు 20 జిల్లాలలో తక్కువ లేదా అత్యల్ప వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జూన్ 1 నుంచి జూలై 17 మధ్య సాధారణ వర్షపాతం 162.6 మి.మీ. కాగా, రాష్ట్రంలో 106.3 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైనట్లు ఐఎండీ తెలిపింది. కోస్తాంధ్ర ప్రాంతంలోని గుంటూరు, పల్నాడు, విజయనగరం జిల్లాలు.. అలాగే రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలలో సాధారణం లేదా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని ఈ జిల్లాలు మినహా, మిగిలిన జిల్లాలలో తక్కువ లేదా భారీ లోటు వర్షపాతాన్ని నమోదు చేసినట్లు ఐఎండీ వెల్లడించింది.పశ్చిమ గోదావరి, అన్నమయ్య, యానాం జిల్లాల్లో 60 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా.. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో 50 శాతం కంటే ఎక్కువ లోటు నమోదైంది. అలాగే తిరుపతి, కడప, బాపట్ల, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, ప్రకాశం జిల్లాల్లో 40 శాతం కంటే ఎక్కువ వర్షపాత లోటు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, అనంతపురం జిల్లాలో మాత్రమే సాధారణ స్థాయికి సమానమైన 95.7 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 1 నుంచి జూలై 17 వరకు సాధారణ వర్షపాతం 192.7 మిల్లీమీటర్లతో పోలిస్తే 35 శాతం లోటుతో 126 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. రాయలసీమకు సంబంధించి సాధారణంగా కురవాల్సిన 119.9 మి.మీ వర్షపాతానికి బదులుగా 83.3 మి.మీ వర్షపాతం నమోదైందని.. ఇది 31 శాతం లోటని ఐఎండీ తెలిపింది.మరోవైపు జూలైలో రుతుపవనాల
వేగం మందగించడంతో.. గత వారం రోజులుగా కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అనేక జిల్లాలలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని.. జూలైలో కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో వడగాలుల పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో, దేశంలోని అనేక ప్రాంతాలు వర్షాభావాన్ని ఎదుర్కొనవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు ఏర్పడితే, రుతుపవనాలు తిరిగి బలం పుంజుకోవచ్చని తెలిపారు.

ఎస్సీ నియోజకవర్గంగా పులివెందుల..?

కడప, జూలై 20, పెన్ పవర్:
పులివెందుల పేరెత్తగానే వైఎస్ ఫ్యామిలీ గుర్తుకొస్తుంది. రాజశేఖర రెడ్డి డబుల్ హ్యాట్రిక్, జగన్ మోహన్ రెడ్డి హ్యాట్రిక్ విజయాలు సాధించిన అసెంబ్లీ స్థానం ఇది. ఇక్కడ 1978 నుంచి వైఎస్ ఫ్యామిలీదే హవా. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ ఒక్కసారి కూడా పసుపు జెండాను ఎగరేయలేకపోయింది. వైఎస్ కుటుంబానికి కంచుకోట లాంటి ఈ నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో జగన్ పోటీ చేయలేని పరిస్థితులు ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్ కుటుంబానికి కంచుకోట. 1978 నుంచి ఇక్కడ వైఎస్ కుటుంబ సభ్యులే ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నారు. రాజశేఖర రెడ్డి ఆరుసార్లు పులివెందుల నుంచి ఎమ్మెల్యేగా గెలవగా.. 2011లో జరిగిన ఉపఎన్నికలో ఆయన సతీమణి విజయమ్మ గెలిచారు. వైఎస్ జగన్ ఇక్కడి నుంచి హ్యాట్రిక్ సాధించారు. రాజశేఖర రెడ్డి సోదరులైన పురుషోత్తం రెడ్డి, వివేకానంద రెడ్డి కూడా ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా పని చేశారు. 1983 నుంచి ఇప్పటి వరకూ టీడీపీ పులివెందులలో ఒక్కసారి కూడా గెలవలేకపోయింది.

అయితే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి పూర్తిగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అసలు పులివెందుల నుంచి వైఎస్ జగన్, ఆయన కుటుంబీకులు పోటీ చేసే పరిస్థితి లేకపోయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటున్నారు. దీనికి వారు ఓ కారణాన్ని బలంగా చెబుతున్నారు. అదే నియోజకవర్గాల పునర్విభజన. 2029 నాటికి డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయితే.. ఏపీలో అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుంది. అదే సమయంలో నియోజకవర్గాల స్వరూపం, రిజర్వేషన్లు మారతాయి. ఈ క్రమంలోనే పులివెందుల నియోజకవర్గంలోనూ మార్పులొస్తాయని.. ఇది ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారొచ్చని లేదంటే అసలు నియోజకవర్గమే లేకుండా పోవచ్చని కొందరు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న పుంగనూరు నియోజకవర్గానికి కూడా ఇదే పరిస్థితి ఎదురు కావచ్చని చెబుతున్నారు.దీనికి 2008 డీలిమిటేషన్‌కు సంబంధించిన ఉదాహరణలు కూడా ప్రస్తావిస్తున్నారు. 2004 ఎన్నిల వరకు కడప జిల్లాలోని బద్వేల్ నియోజకవర్గం జనరల్ స్థానంగా ఉండేదని.. కానీ పునర్విభజన తర్వాత ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారిందని గుర్తు చేస్తున్నారు. ఆ డీలిమిటేషన్‌లో కావలి నియోజకవర్గం రిజర్వేషన్ మారలేదు. కానీ ఆ నియోజకవర్గం భౌగోళిక స్వరూపం మారింది. కావలి పరిధిలోని వింజమూరు, దత్తలూరు మండలాలను ఉదయగిరి నియోజకవర్గంలో చేర్చారు. అప్పటి అల్లూరు నియోజకవర్గంలోని అల్లూరు, దగదర్తి మండలాలను కావలిలో చేర్చారు. ఫలితంగా ఉదయగిరి నియోజకవర్గంలో మండలాల సంఖ్య 8కి పెరిగింది. రాజకీయ ప్రయోజనాల కోసం కావలికి 10 కి.మీ.లో ఉండే జలదంకి మండలాన్ని (గతంలో అల్లూరు నియోజకవర్గంలో ఉండేది) తీసుకెళ్లి ఉదయగిరి నియోజకవర్గంలో కలిపారు. 2009కి ముందు చిత్తూరు పార్లమెంట్ జనరల్ స్థానంగా ఉండేది. డీలిమిటేషన్ తర్వాత అది ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారింది.2009 ఎన్నికలకు ముందు జరిగిన డీలిమిటేషన్ ప్రక్రియలో టీడీపీకి బలంగా ఉన్న స్థానాల్లో చాలా మార్పులు జరిగాయని.. అధికార కాంగ్రెస్‌కు అనుకూలంగా పునర్విభజన ప్రక్రియ జరిగిందని.. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ కూటమి కూడా డీలిమిటేషన్ ప్రక్రియను తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుఅయితే నియోజకవర్గాల పునర్విభజన జరగడం అనేది పూర్తిగా పార్లమెంట్ చేతుల్లో ఉంది. 2026 ఏప్రిల్‌లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లును ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే రాజ్యాంగ సవరణకు అవసరమైన మెజార్టీ రాకపోవడంతో ఈ బిల్లు ఆమోదం పొందలేదు. జులై 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసేందుకు ఎన్డీయే సర్కారు ప్రయత్నించే అవకాశం ఉంది.

అనకాపల్లి నుంచి అయోధ్యకు ట్రైన్..

విశాఖపట్టణం, జూలై 20, పెన్ పవర్:
అనకాపల్లి నుంచి అయోధ్య, కాశీకి ప్రత్యేక రైలు ఆదివారం బయల్దేరి వెళ్లింది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్.. ఈ ప్రత్యేక రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఐదురోజుల పాటు దివ్యదర్శన యాత్ర కొనసాగనుండగా.. ప్రయాణం, వసతి. వైద్యం, భోజనం అన్నీ ఉచితంగా సమకూర్చనున్నారు. ఎంపీ సీఎం రమేష్ ఈ ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించారు. సెప్టెంబర్ నెలలో మరో ప్రత్యేక రైలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని భక్తులకు అయోధ్య రామయ్య దర్శనం కల్పిస్తామని తెలిపారు.కాశీ, అయోధ్యకు వెళ్లాలనుకునే భక్తులకు శుభవార్త. అనకాపల్లి నుంచి కాశీ, అయోధ్యకు ప్రత్యేక రైలు ఆదివారం బయల్దేరి వెళ్లింది. ఈ ప్రత్యేక రైలును రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఆదివారం ఉదయం అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. అనకాపల్లి నుంచి అయోధ్య, కాశీ ఉచిత దివ్య దర్శన యాత్ర పేరుతో ఈ ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. తొలి విడతలో 1,500 మంది భక్తులు అయోధ్య, కాశీ పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక రైలులో బయల్దేరి వెళ్లారు. రైలును ప్రారంభించిన అనంతరం ఎంపీ సీఎం రమేష్.. రైలులో ప్రయాణించి, ప్రయాణికులతో ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి బోగీలోకి వెళ్లి యాత్రికుల సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు.ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన అయోధ్య, కాశీ ఉచిత దర్శన హామీని నిలబెట్టుకున్నట్లు తెలిపారు. ఉచిత దివ్య దర్శన యాత్ర ఐదు రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. అయోధ్య – కాశీ దర్శనం ప్రతి హిందువు జీవితంలో ఒక ఆధ్యాత్మిక అనుభూతని.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు శ్రీరాముడు, కాశీ విశ్వనాథుడి దర్శనం కల్పించాలనే సంకల్పంతో ఈ యాత్ర ప్రారంభించినట్లు వెల్లడించారు. యాత్రలో భాగంగా ప్రయాణం, భోజనం, వసతి, త్రాగునీరు, వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ప్రతి కోచ్‌కు ప్రత్యేక ఇంఛార్జిలను, వాలంటీర్లను నియమించామని.. భక్తుల కోసం ప్రత్యేక వైద్య బృందాలు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.యాత్రికులను స్వాగతించడానికి, ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ముందుగానే వారణాసికి ప్రత్యేక వాలంటీర్ల బృందాన్ని పంపించామని.. ముందుగా కాశీ విశ్వనాథ స్వామి దర్శనం, అనంతరం అయోధ్య శ్రీరామ జన్మభూమి దర్శనం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ యాత్ర పూర్తిగా సేవా కార్యక్రమం మాత్రమేనన్న ఎంపీ సీఎం రమేష్.. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని ప్రతి భక్తుడికి దశలవారీగా ఈ అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. రెండో విడత ప్రత్యేక రైలును సెప్టెంబర్‌లో ఏర్పాటు చేస్తామని.. ప్రజల స్పందన, అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక రైళ్లను కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

పొత్తులకు వైసీపీ ప్రయత్నాలు

విజయవాడ, జూలై 20, పెన్ పవర్:
జగన్ వచ్చే ఎన్నికల్లో పొత్తుకు సిద్ధమవుతున్నారా? అంటే రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు. ఎప్పుడూ దేనినీ తోసిపుచ్చలేం. ప్రచారమని ఇప్పుడు అనుకున్నా.. బలమైన ప్రత్యర్థిని మట్టికరిపించాలంటే తన బలగాన్ని కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. అదే యుద్ధనీతి. రీతి కూడా. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉంది. అయితే కూటమి పాలనపై వామపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయి. చంద్రబాబు పాలనపై విరుచుకుపడుతున్నాయి. అలాగే ప్రతి సమస్యపై పోరాడుతున్నాయి. మరొకవైపు కూటమి లో జరుగుతున్న ప్రతి ఘటనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎర్రదండు కార్యక్రమాలను రూపొందించుకుంది కూటమిలో బీజేపీ ఉండటంతో సహజంగానే వామపక్షాలు జగన్ కు చేరువవుతాయంటున్నారు. అలాగని జగన్ కూడా బీజేపీకి దూరం కాదు. కానీ ప్రత్యక్షంగా పొత్తు లేదు కాబట్టి వైసీపీతో కలసి నడవటానికి ఎర్రన్నలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సీపీఐ నేత రామకృష్ణ ఇటీవల కాలంలో పదే పదే విమర్శలు చేయడం, సీపీఐ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సయితం ప్రతి అంశంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించడం ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. అలాగేఇక సీపీఎం తొలి నుంచి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగానే గళం విప్పుతూనే ఉంది. ఈ రెండు పార్టీలతో కలసి జగన్ వెళతారన్న ప్రచారం జరుగుతుంది. ఇప్పటి వరకూ జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వచ్చారు. వామపక్షాలు మాత్రం ఒకసారి పవన్ తో కలసి పోటీ చేసి ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేదు. ఆ మాట కొస్తే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్

శాసనసభలో వామపక్షాలకు ఇప్పటి వరకూ ప్రాతినిధ్యం లేదు. అయితే జగన్ కు తన బలం, బలగంపై అపార నమ్మకం ఉంది. ఒంటరిగానే పోటీ చేయాలన్న తపన ఉంది. కానీ కూటమిని ఎదుర్కొనాలంటే ఓటు బ్యాంకు లేకపోయినా గట్టి వాయిస్ ఉన్న వామపక్ష పార్టీలు తోడుగా నిలిస్తే కొంత రాజకీయంగా ఉపయోగం ఉంటుందని జగన్ భావిస్తున్నట్లు తెలిసింది. అయితే దీనిపై ఇంకా క్లారిటీ లేకపోయినా వామపక్షాలతో జగన్ పొత్తు పెట్టుకునే అవకాశాలు మాత్రం కొట్టిపారేయలేం.వైసీపీ గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయింది. 151 స్థానాల నుంచి 11కు పడిపోయింది. దీనికి కారణాలు ఏంటన్నవి అందరికీ తెలిసినా.. వైసీపీకి మాత్రం ఇంకా బోధపడలేదు. దీంతో ఇటు పార్టీలోను, అటు నాయకుల్లోనూ మార్పు కనిపించడం లేదన్న వాదన ఉంది. వాస్తవానికి ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు కామనే అయినా.. కారణాలు తెలుసుకుని ముందుకు సాగాల్సిన అవసరం పార్టీలపై ఉంటుంది. వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి.ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత లేదా పుట్టబోయే వ్యతిరేకత తమకు మేలు చేస్తుందని వైసీపీ నాయకులు అంచనా వేసుకుంటున్నారు. వాస్తవానికి ఇది పార్టీ అధిష్టానంలోనే ఉంది. అందుకే క్షేత్రస్థాయి నాయకులు కూడా అదే దారిలో నడుస్తున్నారు. దీంతో వైసీపీలో సరైన దిశానిర్దేశం లేకుండానే నాయకులు ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా పార్టీ పుంజుకునే విషయంలో ఇంకా వెనుక బడే ఉందన్నది వాస్తవం.ముఖ్యంగా నియోజకవర్గాల స్థాయిలో పార్టీకి భారీ ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే వైఖరి పార్టీకి కలిసి రాకపోగా.. వివాదాలకు కేంద్రంగా మారుతోంది. దీనిని సరిచేయాల్సి పార్టీ అధిష్టానం కూడా మౌనంగానే ఉండడం గమనార్హం. అంతా నేతలే చూసుకుంటారులే అనే ధోరణి అవలంభించడంతో పరిస్థితి ఇబ్బందిగానే ఉందన్నది పార్టీకి తెలిసినా.. నాయకులకు ఎలాంటి దిశానిర్దేశం చేయడం లేదు. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో కేవలం నలుగురైదుగురు నాయకులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారు.సీమలో కూడా కేవలం ఇద్దరు ముగ్గురు నేతలు మాత్రమే వాయిస్ వినిపిస్తున్నారు. ఇక, ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణాలో ఒకరిద్దరు కూడా తక్కువగానే ఉన్నారు. గుంటూరులో అయితే.. అంబటి రాంబాబు కేంద్రంగానే వైసీపీ రాజకీయాలు సాగుతున్నాయి. ఇలా.. చేయడం వల్ల పార్టీపరంగా వచ్చే ఇమేజ్ మాట ఎలా ఉన్నా.. పోతున్న ఇమేజే ఎక్కువగా ఉంది. దీంతో రాజకీయంగా వైసీపీ పుంజుకోవడం కూడా కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది. మొత్తంగా ఈ రెండేళ్లలో పార్టీ పెద్దగా పుంజుకున్నది అయితే లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సిదిరిని భయపెడుతున్న కేసులు

శ్రీకాకుళం, జూలై 20, పెన్ పవర్: :ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో శ్రీకాకుళం జిల్లా మరోసారి చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కీలక నాయకుల చుట్టూ వరుసగా వివాదాలు నెలకొంటుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే జిల్లాలో పలువురు ప్రముఖ నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలిచిన నేపథ్యంలో, ఇప్పుడు మాజీ మంత్రి సీదరి అప్పలరాజు పేరు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆయనపై నమోదైన కేసు, అరెస్టు జరిగే అవకాశాలపై జరుగుతున్న ప్రచారం జిల్లాలో రాజకీయ చర్చలకు దారితీస్తోంది.గతంలో పార్టీ తరఫున దూకుడుగా స్పందిస్తూ అధికార పక్షంపై విమర్శలు చేసిన నాయకుల్లో సీదరి అప్పలరాజు ఒకరు. జిల్లాలో పార్టీ తరఫున బలమైన స్వరం వినిపించే నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. అయితే ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం వ్యవహారం ఆయనను ఇబ్బందుల్లోకి నెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో ఆయన కుమారుడు ఆరవ్ వర్మ పేరు ప్రధానంగా వినిపిస్తోంది.పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, వేగంగా బైక్ నడపడం వల్ల జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన అనంతరం ఆరవ్ వర్మను పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆయనను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో మాజీ మంత్రి పాత్రపై కూడా పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.దర్యాప్తులో భాగంగా ప్రమాదానికి సంబంధించిన ఆధారాలను ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందనే అనుమానాలపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ మంత్రిపై కూడా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ప్రచారం సాగుతోంది. భారతీయ న్యాయ సంహిత లోని 61(2), 238, 240, 242, 249, 49 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ కేసు ఆధారంగా తదుపరి చర్యలు ఏముంటాయన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.మాజీ మంత్రి అరెస్టు జరిగే అవకాశముందంటూ పలాస ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు పోలీసులు అధికారికంగా అలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు సీదరి అప్పలరాజు కూడా ఈ ఘటనపై బహిరంగంగా స్పందించలేదు. ఆయన మౌనం కూడా ఈ వ్యవహారంపై మరిన్ని చర్చలకు కారణమవుతోంది.సమాచారం ప్రకారం, ప్రస్తుతం ఆయన న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కేసు పురోగతిని దృష్టిలో పెట్టుకుని తదుపరి న్యాయపరమైన చర్యలపై చర్చిస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే సమయంలో పోలీసు అధికారులు కూడా ఈ కేసును అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నట్లు సమాచారం. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలిచిన పరిస్థితుల్లో, ఇప్పుడు మాజీ మంత్రి చుట్టూ నెలకొన్న ఈ పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

స్వర్ణగ్రామాలుగా మార్పు

ఒంగోలు, జూలై 20, పెన్ పవర్:
ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు స్థాయిలో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థకు ఇప్పుడు కొత్త గుర్తింపు తీసుకురావాలని కూటమి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ కార్యాలయాల పేర్లను మార్చిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ మార్పు ప్రజల్లో స్పష్టంగా కనిపించేలా రాష్ట్రవ్యాప్తంగా కొత్త నేమ్‌బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో ఇకపై “సచివాలయం” అనే పేరుకు బదులుగా “స్వర్ణ గ్రామం” “స్వర్ణ వార్డు” పేర్లు అధికారికంగా మరింత ప్రాధాన్యం పొందనున్నాయి.గ్రామ, వార్డు సచివాలయాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 2019 అక్టోబర్ 2న ప్రారంభించింది. ఆ తర్వాత ఈ వ్యవస్థ ద్వారా పలు ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థపై సమగ్రంగా అధ్యయనం చేసిన అనంతరం పేర్లలో మార్పు తీసుకొచ్చింది. అధికారిక రికార్డుల్లో కొత్త పేర్లు అమల్లోకి వచ్చినప్పటికీ, ప్రజల్లో మాత్రం ఇప్పటికీ చాలా మంది వాటిని సచివాలయాలుగానే పిలుస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం కొత్త చర్యలకు శ్రీకారం చుట్టిందిరాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 15 వేలకుపైగా కార్యాలయాల వద్ద ఒకే నమూనాలో కొత్త నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బోర్డుల రూపకల్పన, పరిమాణం, నాణ్యత విషయంలో కూడా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఆరు మిల్లీమీటర్ల అక్రిలిక్ షీట్‌తో పాటు 3ఐ8 అడుగుల ఏసీపీ (బోర్డులను తయారు చేయాలని నిర్ణయించింది. ఈ బోర్డుల తయారీ, సరఫరా బాధ్యతలను గుంటూరు జిల్లా తాడేపల్లి లోని నెక్స్టోరా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించింది.బోర్డుల తయారీ పూర్తయ్యే కొద్దీ వాటిని వేగంగా సంబంధిత కార్యాలయాలకు చేరవేసి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించింది. అలాగే మండల పరిషత్ అభివృద్ధి అధికారులు , మున్సిపల్ కమిషనర్లు (, సంబంధిత శాఖల అధికారులు బోర్డులను స్వీకరించి ప్రతి కార్యాలయం వద్ద సక్రమంగా అమర్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బోర్డులు ఎలాంటి నష్టం లేకుండా అందాయని నిర్ధారించిన తర్వాత అధికారుల సంతకం, కార్యాలయ ముద్రతో వాటిని నమోదు చేయాలని కూడా స్పష్టం చేసింది. అంతేకాకుండా బోర్డుల వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసి, జిల్లా కోఆర్డినేటర్లు మొత్తం ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది.రాజకీయంగా కూడా ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. గతంలో సచివాలయ భవనాల రంగులు ఒక రాజకీయ పార్టీని గుర్తు చేసేలా ఉన్నాయని విమర్శలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భవనాలకు రాజకీయ పార్టీలను ప్రతిబింబించే రంగులు ఉండకూడదనే విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పుడు కొత్త పేర్లతో పెద్ద నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల్లో కొత్త గుర్తింపును బలపరచాలని భావిస్తోంది. మరోవైపు, ఈ వ్యవస్థను ప్రారంభించింది తమ ప్రభుత్వమే కాబట్టి పేర్లు మారినా ప్రజలు దాని ఆరంభాన్ని గుర్తుంచుకుంటారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ అంశం పరిపాలనతో పాటు రాజకీయ చర్చలకు కూడా కేంద్రబిందువుగా మారింది.

లోకల్ బాడీ ఎన్నికల్లో జనసేన లొల్లి..

గుంటూరు జూలై 20, పెన్ పవర్:
స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోటీపై ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు కూటమిలో అగ్గి రాజేస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన, టీడీపీ నేతల మధ్య సీట్ల పంచాయతీకి దారితీసే అవకాశం ఉంది. అయితే టీడీపీ క్యాడర్ స్పందించి ఎలాంటి ప్రకటనలు చేయకుండా పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే స్పందించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.రాబోయే ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలోని ఏ పార్టీ ఎన్నెన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశంపై టీడీపీ నాయకులెవరూ బహిరంగంగా మాట్లాడవద్దని పార్టీ అధినేతల చంద్రబాబు క్యాడర్‌ను ఆదేశించారు. పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు శనివారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, అనవసర చర్చలకు అవకాశం ఇచ్చేలా ఏ ఒక్కరూ వ్యవహరించవద్దని హెచ్చరించారు. కూటమి భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య విభేదాలు సృష్టించడానికి గొడ్డలి పార్టీ వైసీపీ కాచుకుని కూర్చుందని, ఈ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఎన్నికల కార్యాచరణను మరింత బలోపేతం చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తామని చంద్రబాబు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటు గురించి టీడీపీ నేతలు చర్చించవద్దని, పోటీ చేసే స్థానాలపై ఎలాంటి ప్రకటనలు చేయవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ అంశాన్ని కూటమి పార్టీల అగ్రనాయకత్వం సరైన సమయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధం చ్ఛేయడంపైనే ఫోకస్ చేయాలని సూచించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి అద్భుత ఫలితాలు సాధించేలా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల గుంటూరులో కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో జనసేనకు బలం ఉన్న ప్రతి చోటా తాము తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం, వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసైనికులు వెనక్కి తగ్గారని గుర్తుచేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని, క్షేత్రస్థాయిలో బలాబలాలు చూసుకుని సర్పంచ్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి జన సైనికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఆనాటి సార్వత్రిక ఎన్నికల ఫార్ములా స్థానిక ఎన్నికలకు వర్తించదని, ఈసారి సీట్ల విషయంలో తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పార్టీ కోసం మొదటి నుండి కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు పోటీ చేసేందుకు జనసేనలో తగిన ప్రాధాన్యత, అవకాశాలు కల్పిస్తామన్నారు. కూటమిలోని మిత్రపక్షాలతో తగిన సమన్వయం చేసుకుంటూనే, జనసేన శ్రేణులంతా ఎన్నికలకు సంపూర్ణంగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రకటనతో కూటమిలో సీట్ల సర్దుబాటుపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

దీక్ష విరమిస్తా... కానీ మూడు షరతులు.. సోనమ్ వాంగ్‌చుక్ మెలిక

లడఖ్ ఉద్యమ నేత, ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. ప్రస్తుతం ఆయన ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నప్పటికీ తన పోరాటంలో మాత్రం ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వం తన ముందుంచిన మూడు ప్రధాన షరతుల్లో కనీసం ఒక్కదానినైనా నెరవేరిస్తేనే తాను నిరాహార దీక్షను విరమిస్తానని ఆయన కేంద్రానికి తేల్చి చెప్పారు.

ఆస్పత్రి బెడ్‌పై నుంచే చేతిరాతతో లేఖ

దీర్ఘకాలంగా ఆహారం తీసుకోకుండా నిరసన కొనసాగిస్తున్న కారణంగా సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించింది. అయినప్పటికీ తన ఉద్యమ లక్ష్యాల నుంచి వెనక్కి తగ్గబోనని ఆయన ఉద్ఘాటించారు. ఆస్పత్రి బెడ్‌పైనే చేతిరాతతో ఒక లేఖ విడుదల చేసిన ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉండాల్సిన మాట్లాడే స్వేచ్ఛపై ప్రభుత్వం తీవ్ర ఆంక్షలు విధిస్తోంది. ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు కూడా కనీస అవకాశం లేకుండా చేయడం దురదృష్టకరం." అని సోనమ్ వాంగ్‌చుక్ విమర్శించారు.

సోనమ్ వాంగ్‌చుక్ విధించిన ఆ 3 కీలక షరతులు ఇవే

ప్రభుత్వం ముందు వాంగ్‌చుక్ ఉంచిన డిమాండ్లు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఆ మూడు షరతులు చూస్తే.. ఒకటి దేశవ్యాప్తంగా జరుగుతున్న పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో నెలకొన్న వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ఘటనలపై తక్షణమే స్పష్టమైన చర్యలు తీసుకోవాలి. రెండోది తనతో పాటు సి.జె.పి నాయకులకు పార్లమెంటులోకి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలి. ప్రస్తుత వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో తాను లేవనెత్తిన అంశాలపై తప్పనిసరిగా చర్చిస్తామని ఎంపీలు అధికారికంగా హామీ ఇవ్వాలి. మూడోది ఒకవేళ తన ఆరోగ్యం మరింత క్షీణించి లేవలేని పరిస్థితి ఏర్పడితే పార్లమెంట్ సభ్యులే స్వయంగా ఆస్పత్రికి వచ్చి తన డిమాండ్లపై రాతపూర్వక హామీ ఇవ్వాలి.

ఆరోగ్యంపై వైద్యుల ప్రత్యేక నిఘా

సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి వైద్యులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. దీర్ఘకాల నిరాహార దీక్ష కారణంగా ఆయన శరీరంపై పడే ప్రభావాలను నిరంతరం పరీక్షల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతానికి ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించినప్పటికీ ఈ దీక్ష మరికొంతకాలం ఇలాగే కొనసాగితే అంతర్గత ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యే అవకాశముందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడు కేంద్రం ఏం చేయబోతోంది?

సోనమ్ వాంగ్‌చుక్ విధించిన ఈ మూడు కఠిన షరతులపై కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. ప్రజా సమస్యలపై ప్రభుత్వం చర్చలకు ముందుకు వస్తుందా? లేక ఈ ఉద్యమం మరింత ఉధృత రూపం దాల్చుతుందా? అనేది రానున్న కొన్ని గంటల్లో తేలనుంది.

ఫిఫా ఫైనల్లో ట్రంప్ 'స్పెషల్ ఎంట్రీ'.. ఆట స్పెయిన్‌ది.. హైలైట్ ప్రెసిడెంట్‌ది.. పరువుపాయే..

ఫిఫా వరల్డ్ కప్-2026 ఫైనల్ మ్యాచ్ అంటే ఎలా ఉండాలి? మైదానంలో ఆటగాళ్ల నైపుణ్యం.. గాల్లోకి లేచే ఫుట్‌బాల్.. గోల్ పోస్ట్ దగ్గర ఉత్కంఠ.. ఇవే కదా గుర్తొచ్చేవి? కానీ ఈసారి వీటన్నింటినీ పక్కకు నెట్టేసి మరీ ఒకే ఒక్కడు వార్తల్లో నిలిచాడు. ఆయనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. స్పెయిన్, అర్జెంటీనా మధ్య జరిగిన ఈ మహా సంగ్రామంలో స్పెయిన్ చివరి నిమిషంలో గోల్ కొట్టి ట్రోఫీని ముద్దాడితే.. స్టేడియంలో ఉన్న డొనాల్డ్ ట్రంప్ మాత్రం సోషల్ మీడియాలో 'ట్రెండింగ్ ట్రోఫీ'ని గెలుచుకున్నారు.

'వెల్‌కమ్' అంటే ఇలాగేనా మరి?

మ్యాచ్ ప్రారంభానికి ముందు అధ్యక్షుల వారు భారీ భద్రత మధ్య.. ఎంతో హుందాగా స్టేడియంలోకి అడుగుపెట్టారు. సాధారణంగా ఇలాంటి పెద్ద లీడర్లు వస్తే చప్పట్లు, కేరింతలు కామన్‌గా వినిపిస్తాయి. కానీ అక్కడ ఉన్నది ఫుట్‌బాల్ ఫ్యాన్స్ కదా.. ట్రంప్ రాకను గమనించిన వేలాది మంది ప్రేక్షకులు ఒక్కసారిగా 'బూయింగ్' (కూతలు పెట్టడం) చేయడంతో స్టేడియం దద్దరిల్లేలా అసంతృప్తిని వెళ్లగక్కారు.

పాపం.. ట్రంప్ తనదైన స్టైల్లో అభివాదం చేద్దామనుకునే లోపే.. ఫ్యాన్స్ తమ 'రాజకీయ అభిప్రాయాన్ని' ఫుట్‌బాల్ శైలిలోనే గట్టిగా చెప్పేశారు. ఈ వీడియోలు కాస్తా సోషల్ మీడియాలోకి ఎక్కడంతో నెటిజన్లు "పాపం ట్రంప్, హోమ్ గ్రౌండ్‌లోనే ఇలాంటి పరాభవమా!" అంటూ మీమ్స్‌తో రెచ్చిపోతున్నారు.

ట్రోఫీ మాది.. వేదిక ట్రంప్ ది

నిజానికి అసలు సిసలైన డ్రామా మ్యాచ్ ముగిసిన తర్వాతే మొదలైంది. స్పెయిన్ జట్టు విజేతగా నిలిచాక.. ట్రోఫీ ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. అందులో మన ప్రెసిడెంట్ గారు కూడా పాలుపంచుకున్నారు. సాధారణంగా అయితే ట్రోఫీ ఇచ్చేసి.. ఫోటోలకు ఫోజులిచ్చి అతిథులు సైలెంట్‌గా పక్కకు తప్పుకుంటారు. ఎందుకంటే అది గెలిచిన జట్టు సెలబ్రేట్ చేసుకునే సమయం. కానీ మన ట్రంప్ గారు అలా చేస్తారా? "నేను ఎక్కడుంటే అక్కడే కెమెరాలు ఉండాలి" అన్నట్లుగా ఆయన ఆ వేదికను వదిలి వెళ్ళడానికి అస్సలు ఇష్టపడలేదు. స్పెయిన్ ఆటగాళ్లు ట్రోఫీ పట్టుకుని ఎగురుతుంటే.. ట్రంప్ మాత్రం ఆ జట్టులో తానే పదకొండో ప్లేయర్ అన్న రేంజ్‌లో అక్కడే నిలబడిపోయారు. పాపం.. స్పెయిన్ ఆటగాళ్లకు ఆనందం పంచుకోవాలో.. లేక పక్కనే ఉన్న పెద్దాయనను చూసి సైలెంట్‌గా ఉండాలో తెలియక తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ట్విస్ట్ ఏంటంటే.. పరిస్థితి చేతులు దాటిపోతోందని గ్రహించిన ఫిఫా అధ్యక్షుడు మెల్లగా ట్రంప్ దగ్గరకు వెళ్లి ఆయన చేతిని పట్టుకుని "ఇక చాలు సార్, పదండి వెళ్దాం" అన్నట్లుగా పక్కకు తీసుకెళ్లాల్సి వచ్చింది.

సోషల్ మీడియాలో ట్రంప్ 'గోల్'

ప్రస్తుతం ఈ విజువల్స్ ఎక్స్ , ఇన్‌స్టాగ్రామ్‌లలో తెగ వైరల్ అవుతున్నాయి. కొందరేమో "ట్రంప్‌కు క్రీడా స్ఫూర్తి లేదు.. లైమ్‌లైట్ కోసం పాకులాడారు" అని విమర్శిస్తుంటే ట్రంప్ ఫ్యాన్స్ మాత్రం "ఆయనకు ఫుట్‌బాల్ అంటే ఇష్టం.. అందుకే కాసేపు ఆటగాళ్లతో గడిపారు.. దీనికి అంత సీన్ లేదు" అంటూ కవర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏది ఏమైనా స్పెయిన్ జట్టు కష్టపడి కప్పు గెలిస్తే ట్రంప్ మాత్రం కేవలం తన 'ప్రెజెన్స్'తో వరల్డ్ కప్ మొత్తాన్ని తన వైపు తిప్పుకున్నారు. దీనినే "ఆట వేరొకరిది.. హైలైట్ మనది" అంటారేమో...

56 ఏళ్ళ యువకుడు....మోడీ సెటైర్లు ఎవరి మీద ?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం సందర్భంగా చాలా కాలం తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ మీడియా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన తనదైన శైలిలో విపక్షాల మీద విమర్శలు చేశారు. పార్లమెంట్ అంటే బలమైన వాదనలకు వేదిక కావాలని ఆయన కోరారు. అంతే తప్ప అక్కడ శబ్దాలకు తావు లేదని అన్నారు. దేశంలో గడచిన నెల రోజులుగా ఎన్నో పరిణామాలు జరిగాయని వాటి మీద అర్థవంతమైన చర్చకు పార్లమెంట్ సిద్ధంగా ఉందని మోడీ చెప్పారు.

యువత విజయం అంటూ :

ఇదిలా ఉంటే మోడీ అంతరిక్షంలోకి స్కైరూట్ సంస్థ విక్రమ్ రాకెట్‌ను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపడం మీద హర్షం వ్యక్తం చేశారు. ఇది 28 ఏళ్ళ యువత సాధించిన ఘన విజయం అని మోడీ అన్నారు. దేశానికి ఇది గర్వకారణం అంటూ మన యువత కొత్త ఆలోచనలకు కేంద్ర బిందువుగా మారారు అన్నారు. భారతీయ యువ శక్తిని వారు అన్ని విధాలుగా చాటుతున్నారు అని మోడీ చెప్పుకొచ్చారు.

ఆయన గురించేనా :

ఇదే సందర్భంలో మోడీ తాను 56 ఏళ్ళ యువకుడు గురించి మాట్లాడటం లేదని సెటైర్లు వేశారు. ఎవరా యువకుడు అంటే రాహుల్ గాంధీ గురించేనా మోడీ ఈ విధంగా ఇండైరెక్ట్ గా కామెంట్స్ చేశారు అని అంతా చర్చించుకుంటున్నారు. రాహుల్ గాంధీ మోడీ ప్రభుత్వం మీద విమర్శలు చేస్తున్న నేపథ్యంలో మీడియా ముఖంగా ఆయన ఈ విధంగా కౌంటర్ ఇచ్చారు అన్న మాట. తాను దేశీయ యువత విజయాల గురించే ప్రస్తావిస్తున్నాను వారే దేశానికి గర్వకారణం అంటూనే 56 ఏళ్ళ యువకుడు అని రాహుల్ ని ఇండైరెక్ట్ గా మోడీ ఎద్దేవా చేశారు అని చర్చించుకుంటున్నారు.

సభకు సహకరించాలి :

పార్లమెంట్ సజావుగా సాగేందుకు ఎంపీలు అంతా సహకరించాలని మోడీ కోరారు. ప్రజా స్వామ్యం అంటేనే చర్చలు ఉంటాయి వాదనలు ఉంటాయని ఆయన అంటూ వీటి కారణంగా సభా సమయం వృధా కారాదు అని విపక్షాలకు మోడీ హితవు పలికారు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాల మీదనే సభ దృష్టి పెట్టాలని సూచించారు. పశ్చిమాసియా సంక్షోభం వల్లనే చమురు ధరలు పెరిగాయని యుద్ధం వల్ల అన్ని దేశాలు నష్టపోతున్నాయని మోడీ అన్నారు. అయినా సరే భారత దేశం ఈ సమస్యను సమర్ధంగా ఎదుర్కొందని మోడీ చెప్పారు. మొత్తం మీద మోడీ చేసిన 56 ఏళ్ళ యువకుడు కామెంట్స్ మాత్రం వైరల్ అయ్యాయి. మరి దీనిని రాహుల్ నుండి ఏ విధమైన రియాక్షన్ ఉంటుందో చూడాల్సి ఉంది. ఎందుకంటే రాహుల్ ట్వీట్ల ద్వారా అలాగే పార్లమెంట్ లో స్పీచ్ ద్వారా మీడియా ముఖంగానూ మోడీ మీద విమర్శలు ఎక్కుపెడుతూ ఉంటారు. మరి ఆయన మోడీ ప్రభుత్వం గురించి ఏ విధమైన కొత్త వాదనలతో ముందుకు వస్తారో చూడాల్సిందే.

యువత అంటే వారేనా... కాక్రోచ్ దండు వేరేనా !

ఎక్కడ నుంచి వచ్చిదో తెలియదు కానీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అతి పెద్ద కాక్రోచ్ దండు కనిపించింది. ఒక వైపు వర్షం పడుతున్నా యువత లెక్క చేయకుండా ఉక్కు పిడికిలి బిగించి పార్లమెంట్ వైపుగా ర్యాలీకి నడుము కట్టింది. ఢిల్లీలో 144 సెక్షన్ విధించారు. అలాగే ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను మోహరించారు. అయినా సరే కాక్రోచ్ సైన్యం మాత్రం వెర్రి ఆవేశంతో జాతీయ జెండా చేత బూని పరుగులు తీయడం ద్వారా ప్రకంపనలు సృష్టించింది. అలాగే చాలా మంది చేతిలో అంబేద్కర్ ఫోటో ఉంది. సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ ఫోటోతో మరికొందరు కదం తొక్కారు. కాక్రోచ్ దండుని కట్టడి చేసేందుకు పోలీసులు పెద్ద ఎత్తున మోహరించడం విశేషం.

ఇంధనం అదేనా :

దేశం నలుమూలల నుంచి యువత జంతర్ మంతర్ వద్దకు చేరుకోవడం ఒకింత ఆశ్చర్యం కలిగించేదే అని అంటున్నారు. అక్కడ ప్రముఖ పార్టీ వేదిక ఏదీ లేదు. ఆకట్టుకునే నేతలు అంతకంటే లేరు. ఖర్చు పెట్టి జనాలను తరలించారు అనుకోవడానికి వచ్చిన వారు అంతా అతి సామాన్యులు, సగటు యువకులు. కానీ వారిలో ఏదో తెలియని ఆవేశం, ఆగ్రహం, అసంతృప్తి. బహుశా అదే వారిని వందల కిలోమీటర్ల దూరం నుంచి ఢిల్లీ దాకా తీసుకుని వచ్చిన ఇంధనం అని అంటున్నారు. యువతలో కనిపిస్తున్న ఈ అసహనం కొంతమందిదేనా లేదా అంతమందిదీనా అన్నదే ఇపుడు అతి పెద్ద చర్చగా ఉంది.

యువత అంటే మరి :

ఇదిలా ఉంటే ప్రధాని మోడీ కూడా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా యువత గురించే ప్రత్యేకంగా మాట్లాడారు. భారత దేశానికి యువ శక్తి గర్వ కారణం అన్నారు. వారు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు అన్నారు. వినూత్నమైన ఆలోచనలు చేస్తున్నారు అని కూడా కొనియాడారు. అంతరిక్షంలో విక్రమ్ రాకెట్‌ను ని పంపిన యువత గురించి మోడీ పొగిడారు. అదే సమయంలో ఢిల్లీ వీధులలో కూడా మొత్తంగా యువత కదం తొక్కుతోంది. మరి ఈ యువత సంగతేంటి అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆందోళనలు చేస్తున్న ఈ యువత వేరేనా అన్నది విపక్షాలు సంధిస్తున్న ప్రశ్న.

అంతరిక్షంలోనూ నడి వీధుల్లోనూ :

యువత అంటే ఉరకలెత్తే జలపాతం. ఎత్తు పల్లాలు చూసుకోకుండా దూకుడు చేయడం దాని నైజం. అంతరిక్షంలో విక్రమ్ రాకెట్‌ను ప్రయోగించి సక్సెస్ అయింది కూడా యువతే. అంతే కాదు ఢిల్లీ నడి వీధుల్లో గొంతు పెంచి ఆందోళనలు చేస్తోంది యువతే అని అంటున్నారు. యువత ఎక్కడైనా అదే జోరు ఉంటుందని అయితే వారు ఎదుర్కొనే సమస్యలను అడ్రస్ చేయడం బట్టే వారు స్పీడ్ కి కళ్ళెం వేయగలం తప్పించి వారిని అడ్డుకుంటే అయ్యేది కాదని అంటున్నారు. కాక్రోచ్ దండు విషయం తీసుకుంటే ఇంటర్నెట్ ఆపేసినా పోలీసులు పెద్ద ఎత్తున లాఠీ ఛార్జ్ చేసినా బోరున వానలో సైతం పట్టించుకోకుండా పార్లమెంట్ దిశగా పరుగులు తీస్తున్న యువతని చూస్తుంటే యువ శక్తి ఎక్కడైనా ఒక్కటే అని అర్థం అవుతోంది. అందుకే వారి సమస్యలను సాకల్యంగా విని పరిష్కరించడమే ఉత్తమం అని విపక్షాలతో పాటు మేధావులూ కోరుతున్నారు.

ఇరాన్ నుంచి మాయం.. 'మోజ్తబా ఖమేనీ' ఎక్కడ? తెర వెనుక కథలు..

పశ్చిమాసియాలో రోజుకో కొత్త సీరియల్ ఎపిసోడ్ నడుస్తోంది. తాజాగా ఇరాన్ నుంచి ఒక ఇంట్రెస్టింగ్ సస్పెన్స్ థ్రిల్లర్ బయటకొచ్చింది. ఇరాన్ నెక్స్ట్ 'సుప్రీం బాస్' రేసులో ఉన్నట్లు చెప్పుకునే మోజ్తబా ఖమేనీ సడన్‌గా మాయమయ్యారట.. ఆయన దేశంలోనే లేరంటూ అంతర్జాతీయ మీడియా కోడై కూస్తోంది. అయితే ఇరాన్ ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో "మాకు సంబంధం లేదు.. మాకు తెలియదు" అన్నట్లు మౌనవ్రతం పాటిస్తోంది.

బాస్ ఎక్కడ? ప్రకటనలు ఎవరివి?

సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ వార్తా సంస్థ 'అల్ హదత్' ఒక రేంజ్ ట్విస్ట్ ఇచ్చింది. మోజ్తబా ఖమేనీ పేరుతో వస్తున్న ఘాటైన ప్రకటనలన్నీ ఆయన సొంతంగా రాస్తున్నవి కావట. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కు చెందిన అహ్మద్ వహిదీ ఆఫీసు నుంచి ఆ స్క్రిప్ట్‌లు రెడీ అయి మార్కెట్లోకి వస్తున్నాయని బాంబు పేల్చింది. అంటే.. అక్కడ నడుస్తున్నది "వాయిస్ ఓవర్" రాజకీయం అన్నమాట.. ట్విస్ట్ ఏంటంటే.. అసలు మోజ్తబా ఇరాన్‌లోనే ఉన్నారా లేక ఎక్కడైనా లాంగ్ వెకేషన్‌లో ఉన్నారా అనే దానికి ఇరాన్ దగ్గర ఇప్పటికీ అఫీషియల్ ఆన్సర్ లేదు.

ఇంట్లో ఈగలు.. బయట పులులు

అమెరికాతో కాల్పుల విరమణ, దౌత్య చర్చల విషయంలో ఇరాన్ అంతర్గత రాజకీయాల్లో పెద్ద కురుక్షేత్రమే నడుస్తోంది. ఒకవైపు "తగ్గేదే లే" అనే హార్డ్‌లైన్ వర్గాలు, మరోవైపు "కొద్దిగా సర్దుకుపోదాం" అనే ప్రభుత్వ వర్గాల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. ఈ గొడవల్లో పాపం ఐఆర్.జీసీకి ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఇటీవల జరిగిన ఖమేనీ అంత్యక్రియల్లో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకి ఊహించని షాక్ తగిలింది. కొందరు ఆందోళనకారులు ఆయనపై ఏకంగా రాళ్ల వర్షం కురిపించారు. అమెరికాతో డీల్ కుదుర్చుకున్నందుకు ఆయన్ను "డీల్ మేకర్", "దేశద్రోహి" అంటూ ఘనంగా సన్మానించారు. దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు.. ఇరాన్ పాలిటిక్స్ ఎంత 'హాట్'గా ఉన్నాయో..

తెరపై కొత్త హీరోలు.. ట్రంప్ గారి పాత డైలాగులు!

పాశ్చాత్య మీడియా కథనాల ప్రకారం మోజ్తబా ఖమేనీ పబ్లిక్‌లోకి రావడం ఎప్పుడో అమవాస్యకో, పౌర్ణమికో జరుగుతుందట. ప్రస్తుతం ఇరాన్ గురించిన కీలక నిర్ణయాలన్నీ మాజీ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ భాగేర్ ఘలీబఫ్, అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అరాగ్చీలే చూసుకుంటున్నారట. ఇక ఇవన్నీ చూస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఊరుకుంటారా? ఆయన కూడా సీన్ లోకి ఎంట్రీ ఇచ్చి తన మార్కు కామెంట్ చేశారు. ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని సరిగ్గా పాటించకపోయినా మా రూట్ మారదు. మా ఏకైక టార్గెట్.. ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కకుండా చూడడమే!

అంతా సస్పెన్స్!

మోజ్తబా ఖమేనీ మాయమవ్వడం వెనుక అసలు నిజం ఏంటనేది ప్రస్తుతానికి ౧ మిలియన్ డాలర్ల ప్రశ్నే. ఇవన్నీ కేవలం అంతర్జాతీయ మీడియా అల్లిన కథలా లేక నిజంగానే ఇరాన్ సర్కార్ ఏదైనా దాస్తోందా అనేది కాలమే నిర్ణయించాలి. ఇరాన్ ప్రభుత్వం నోరు విప్పేంతవరకు ఈ "మిస్టరీ" ఇలాగే కొనసాగుతుంది!

భారత అంతరిక్ష చరిత్రలో జూలై 18 ఒక సువర్ణాధ్యాయం. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అంకుర సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన 'విక్రమ్-1' రాకెట్.. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లి, కేవలం పదిహేడు నిమిషాల్లోనే 450 కిలోమీటర్ల కక్ష్యలోకి ఉపగ్రహాలను విజయవంతంగా ప్రవేశపెట్టింది. 'మిషన్ ఆగమనం'గా నామకరణం చేసిన ఈ ప్రయోగం.. దేశీయ ప్రైవేటురంగం సొంతంగా నిర్మించిన రాకెట్‌తో కక్ష్యను చేరిన తొలి సందర్భం. దీంతో ప్రైవేటు సంస్థల ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యం సాధించిన మూడో దేశంగా -అమెరికా, చైనా సరసన భారత్ సగర్వంగా నిలిచింది. ఈ విజయం వెనుకనున్న ప్రస్థానం స్ఫూర్తిదాయకం. ఇస్రో మాజీ ఇంజినీర్లు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో స్థాపించిన స్కైరూట్.. 2020లో ఇంజిన్ పరీక్షలు, 2022లో 'విక్రమ్-ఎస్' సబ్-ఆర్బిటల్ ప్రయోగం అనే మెట్లు ఎక్కుతూ, ఎనిమిదేళ్లలోనే కక్ష్యను అందుకుంది. ఈ ఏడాది ఆరంభంలోనే బిలియన్ డాలర్ల విలువను అందుకున్న తొలి భారతీయ అంతరిక్ష రంగ సంస్థగా నిలిచిన స్కైరూట్.. భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ పేరును తన రాకెట్‌కు పెట్టుకోవడం ఔచిత్యానికి నిదర్శనం. కర్బన మిశ్రమ (కార్బన్ కాంపోజిట్) నిర్మాణంతో తేలికగా, పటిష్ఠంగా రూపొందిన ఈ నాలుగు దశల వాహక నౌక.. సుమారు 350 కిలోల వరకు పేలోడ్లను మోసుకెళ్లగలదు. అయితే విక్రమ్-1 ప్రత్యేకత దాని సాంకేతికతలో మాత్రమే కాదు, వ్యాపార నమూనాలోనూ ఉంది. పెద్ద రాకెట్లలో 'రైడ్‌షేర్' పద్ధతిలో ఉపగ్రహాలను పంపితే.. ఏ కక్ష్యలో, ఎప్పుడు దించుతారన్నది రాకెట్ యజమాని ఇష్టం. కానీ స్కైరూట్ దీన్ని 'క్యాబ్ సర్వీసు'గా మార్చింది. వినియోగదారుడు తనకు కావాల్సిన కక్ష్యను, ప్రయోగ సమయాన్ని ఎంచుకోవచ్చు; అందుకు కాస్త అధిక ధర చెల్లించాలంతే. పీఎస్ఎల్వీ కంటే తక్కువ, ఎస్ఎస్ఎల్వీ కంటే ఎక్కువ ధరతో ప్రయోగాలు చేపట్టాలన్నది సంస్థ లక్ష్యం. మరింత శక్తిమంతమైన 'విక్రమ్-2' ప్రణాళికలూ సిద్ధంగా ఉన్నాయి. ఈ విజయం అసంఖ్యాక యువతను పెద్ద కలలు కనేలా, నిర్భయంగా ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహిస్తుందని ప్రధాని మోదీ ప్రశంసించడం సముచితమే.

నిజానికి ఈ ఘనతను ఒక్క సంస్థ విజయంగా కాకుండా.. దేశ అంతరిక్ష విధాన పరివర్తనకు పట్టిన అద్దంగా చూడాలి. దాదాపు ఆరు దశాబ్దాలపాటు భారత్‌లో అంతరిక్ష ప్రయోగాలన్నీ ఇస్రో గుత్తాధిపత్యంలోనే సాగాయి. ప్రైవేటు సంస్థల పాత్ర విడిభాగాల సరఫరాదారులకే పరిమితమైంది. అపారమైన ఇంజినీరింగ్ ప్రతిభ ఉన్నా.. సొంతంగా రాకెట్ కట్టే అవకాశం ప్రైవేటు రంగానికి లేకపోయింది. 2020లో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణలు ఈ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయి. అంతరిక్ష రంగాన్ని ప్రైవేటు సంస్థలకు తెరిచి, ఇన్-స్పేస్ వంటి నియంత్రణ-ప్రోత్సాహక వ్యవస్థను ఏర్పాటు చేయడం, 2023 అంతరిక్ష విధానం ద్వారా వాణిజ్య కార్యకలాపాలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడం, 2024లో ప్రయోగ వాహనాల్లో ఆటోమేటిక్ రూట్ ద్వారా 49 శాతం వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతించడం.. ఇవన్నీ కలిసి ప్రైవేటు అంతరిక్ష విప్లవానికి బాటలు వేశాయి. దీనివల్ల ఇస్రోపై భారం తగ్గి.. ఆ సంస్థ పరిశోధన, అభివృద్ధి, శాస్త్రీయ యాత్రలపై

ప్రయివేట్ 'విక్రమార్కుడు'!

దృష్టి కేంద్రీకరించే వెసులుబాటు లభించింది. చంద్రయాన్, గగన్‌యాన్ వంటి బృహత్తర లక్ష్యాలను ఇస్రో సాధిస్తుంటే.. వాణిజ్య ప్రయోగాల బరువును ప్రైవేటు రంగం పంచుకునే శ్రమ విభజన ఇది. ప్రస్తుతం సుమారు 8 బిలియన్ డాలర్లుగా ఉన్న జాతీయ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచాలన్న ప్రభుత్వ బృహత్ లక్ష్యంలో.. ఉపగ్రహ తయారీ, కమ్యూనికేషన్లు, నావిగేషన్, భూ పరిశీలన రంగాలతోపాటు ప్రయోగ సేవలు కీలక భూమిక పోషించనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చిన్న ఉపగ్రహాల ప్రయోగ మార్కెట్ శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో.. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇంజినీరింగ్ అందించగల భారత్‌కు ఇది సువర్ణావకాశం. యూరప్, ఆసియా దేశాలు సైతం సొంత ప్రయోగ సామర్థ్యం కోసం దేశీయ సంస్థలను ప్రోత్సహిస్తున్న ఈ పోటీ యుగంలో.. స్కైరూట్ విజయం భారత్‌కు వ్యూహాత్మక ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. పైగా ఈ చరిత్రాత్మక సంస్థ హైదరాబాద్ నుంచి ఎదగడం.. తెలుగు నేల అంతరిక్ష ఆవిష్కరణల కూడలిగా మారుతోందనడానికి మరో తార్కాణం.

అయితే ఇంజినీరింగ్ విజయం వేరు, వాణిజ్య విజయం వేరు. అసలు పరీక్ష ఇప్పుడే మొదలైందన్నది వాస్తవం. కక్ష్యను చేరడం ఎంత కష్టమో.. దాన్ని లాభసాటి వ్యాపారంగా మలచడం అంతకంటే కష్టమన్నది నిజం. స్కైరూట్ ముందున్న తొలి సవాలు.. పునరావృత సామర్థ్యం. ఒక్క ప్రయోగం విజయవంతం కావడం కాదు.. వరుస ప్రయోగాలను స్థిరమైన నాణ్యతతో, స్థిరమైన ఖర్చుతో నిర్వహించగలగాలి. ఉత్పత్తిస్థాయి పెరిగే కొద్దీ బ్యాచ్‌ల మధ్య నాణ్యతా వ్యత్యాసాలను నియంత్రించడం ఇంజినీరింగ్ పరంగా పెద్ద పరీక్షే. రెండోది పోటీ. అంతర్జాతీయ ప్రయోగ మార్కెట్‌లో స్పేస్‌ఎక్స్, రాకెట్ ల్యాబ్‌వంటి బలమైన బ్రాండ్లతోపాటు వేగంగా విస్తరిస్తున్న చైనా సంస్థల దూకుడు ఉంది. పెద్ద రాకెట్లలో రైడ్‌షేర్ పద్ధతిన కిలోకు అయ్యే ఖర్చు ఇప్పటికీ చాలా సందర్భాల్లో తక్కువే. కక్ష్య, సమయం ఎంచుకునే సౌలభ్యం కోసం ప్రీమియం చెల్లించే వినియోగదారుల మార్కెట్ పరిమాణం ఎంతన్నది ఇంకా అనిశ్చితమే. స్కైరూట్ పందెం మొత్తం ఆ మార్కెట్ మీదే ఆధారపడి ఉంది. మూడోది, అత్యంత కీలకమైనది -చట్టపరమైన శూన్యత. భారత్‌కు ఇప్పటికీ సమగ్రమైన 'అంతరిక్ష కార్యకలాపాల చట్టం' లేదు. ప్రయోగ వైఫల్యమో, కక్ష్యలో ప్రమాదమో సంభవిస్తే బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు.. విధానాలు, ఒప్పందాలు, ప్రస్తుత చట్టాలు, అంతర్జాతీయ ఒడంబడికల సమాహారమే తప్ప స్పష్టమైన శాసనం సమాధానం చెప్పదు. ఈ దీర్ఘకాలిక నియంత్రణ అనిశ్చితి.. పెట్టుబడిదారులకూ, బీమా సంస్థలకూ, అంతర్జాతీయ వినియోగదారులకూ సందేహాలు రేపుతుంది. అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను నిజంగా 44 బిలియన్ డాలర్లకు చేర్చాలంటే.. పార్లమెంటు ఆమోదంతో పటిష్ఠమైన అంతరిక్ష చట్టాన్ని తీసుకురావడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం కావాలి. అలాగే, వాణిజ్య విజయం కలను సాకారం చేసే బాధ్యత స్కైరూట్ పట్టుదలపైనే కాదు.. విధాన నిర్ణేతల దూరదృష్టిపైనా సమానంగా ఉంది. 'ఆగమనం' జరిగింది.. ఇక 'ప్రస్థానం' నిలకడగా సాగాలని ఆకాంక్షిద్దాం!!

పనికొచ్చే పలుకు



నువ్వే.. నీ విజయం!

"ప్రపంచం నిన్ను ఇంకేదో చేయాలని నిరంతరం ప్రయత్నిస్తున్నప్పుడు.. నీలా నువ్వు ఉండటమే అన్నింటికంటే పెద్ద విజయం" -ప్రఖ్యాత అమెరికన్ తత్వవేత్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ చెప్పిన ఈ మాట.. శతాబ్దంన్నర దాటినా ఈనాటికీ సజీవంగానే ఉంది. నిజానికి ఇప్పుడే దీని అవసరం మరింత ఎక్కువైంది. ఎందుకంటే మనం జీవిస్తోంది.. ప్రతి క్షణం మనల్ని మరొకరిలా మార్చాలని చూసే ప్రపంచంలో. సోషల్ మీడియా తెరిస్తే చాలు.. ఎవరో సాధించిన విజయాలు, ఎవరివో విలాసవంతమైన జీవితాలు, మరెవరివో అందాలు మన కళ్ల ముందు నిలుస్తాయి. 'నువ్వు ఇలా ఉండాలి, అలా కనిపించాలి, ఈ ఉద్యోగమే చేయాలి, ఆ స్థాయికే చేరాలి' అంటూ సమాజం నిర్దేశించే కొలమానాల ధాటికి.. మనలో చాలామంది తమదైన అస్తిత్వాన్ని ఎక్కడో పోగొట్టుకుంటున్నారు.

ఇక్కడో విషయం గమనించాలి. మొక్క ఏదైనా సరే.. తనదైన రీతిలో ఎదిగినప్పుడే పుష్పిస్తుంది. మామిడి చెట్టును చూసి వేప చెట్టు బాధపడదు. గులాబీని చూసి మల్లె తన రంగు మార్చుకోదు. ప్రకృతిలో ప్రతి జీవి తన సహజత్వంతోనే రాణిస్తుంది. కానీ మనిషి మాత్రం.. పక్కవాడి జీవితాన్ని కొలబద్దగా చేసుకుని, తన ప్రత్యేకతను తానే చెరిపేసుకుంటున్నాడు. ఇతరుల అంచనాలకు తగ్గట్టు జీవించే ప్రయత్నంలో.. లోలోపల నలిగిపోతున్నాడు. మానసిక ఒత్తిడి, అసంతృప్తి, ఆత్మన్యూనత వంటివన్నీ చాలావరకు ఈ 'పోలిక' నుంచే పుడుతున్నాయనేది కాదనలేని సత్యం.

మరి దీన్నుంచి బయటపడేదెలా? ముందుగా మనల్ని మనం నిజాయితీగా అర్థం చేసుకోవాలి. మన బలాలేంటో, బలహీనతలేంటో, మనసుకు నిజంగా ఆనందాన్నిచ్చేదేంటో గుర్తించాలి. ఆ తర్వాత.. ఇతరుల అభిప్రాయాలను వినడానికీ, వాటికి బానిసవ్వడానికీ మధ్య ఉన్న గీతను స్పష్టంగా గీసుకోవాలి. మంచి సలహాలను స్వీకరించడం వివేకం. కానీ ప్రతి ఒక్కరినీ మెప్పించాలనే తాపత్రయం మాత్రం ఆత్మవినాశనం. రోజూ కాసేపు మనతో మనం గడపడం, మన ఇష్టాలకు సమయం కేటాయించడం, 'నో' చెప్పాల్సిన చోట ధైర్యంగా చెప్పడం.. ఇవన్నీ మన అస్తిత్వాన్ని కాపాడుకునే చిన్నచిన్న అలవాట్లే. ఇతరులతో పోల్చుకోవడం మానేసి.. 'నిన్నటి నాకంటే నేడు నేను ఎంత మెరుగయ్యాను' అని ప్రశ్నించుకోవడం మొదలుపెడితే.. జీవితం పట్ల దృక్పథమే మారిపోతుంది.

చరిత్రను తిరగేస్తే.. ప్రపంచాన్ని ప్రభావితం చేసినవారంతా తమదైన బాటలో నడిచినవారే. అందరిలా ఆలోచించి ఉంటే గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం చేసేవారు కాదు. లోకం నవ్విందని వెనకడుగు వేసి ఉంటే అబ్దుల్ కలాం క్షిపణి శాస్త్రవేత్త అయ్యేవారు కాదు. వారి విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం.. ప్రతిభ ఒక్కటే కాదు, తమను తాము నమ్మి, తమలా తాము నిలబడిన ధైర్యం కూడా.

అయితే 'నీలా నువ్వు ఉండటం' అంటే మొండిగా మారడమో, ఎదగడానికి నిరాకరించడమో కాదు. లోపాలను సరిదిద్దుకుంటూ, విలువలను వదలకుండా, మన మూలాలను కాపాడుకుంటూ ఎదగడం. బయటి ప్రపంచపు హోరులో.. లోపలి గొంతుకను వినగలగడం. ఆ సమతుల్యత సాధించిన రోజు.. ఇతరుల ఆమోదం కోసం వెంపర్లాడాల్సిన అవసరం ఉండదు. మనశ్శాంతి మన వెంటే నడుస్తుంది. అదే ఎమర్సన్ చెప్పిన 'అన్నింటికంటే పెద్ద విజయం'. ఎందుకంటే.. ఈ ప్రపంచంలో ప్రతిదీ నకలు తీయవచ్చు గానీ.. 'నువ్వు' అనే అసలును మాత్రం ఎవరూ సృష్టించలేరు. ఆ అరుదైన అసలుతనమే నీ అసలైన సంపద.

లోయలో పుస్తకాలపై పహారా!

కశ్మీర్ లోయలో ఇప్పుడు తుపాకుల మోత లేదు.. పుస్తకాల చుట్టూ యుద్ధం నడుస్తోంది. విద్యాసంస్థల్లోని ప్రతి పుస్తకాన్నీ 'అభ్యంతరకర అంశాల' కోసం జల్లెడ పట్టాలన్న అధికారుల ఉత్తర్వులు పెను దుమారం రేపుతున్నాయి. వేర్పాటువాద నేతలను 'మహనీయులు'గా కీర్తించిన రెండు పుస్తకాలు స్కూలు లైబ్రరీల్లోకి చేరడమే ఈ ఆదేశాలకు మూలం. యువతను విషభావజాలం నుంచి కాపాడే చర్య అని ప్రభుత్వం అంటుంటే.. చరిత్రను చెరిపే కుట్ర అని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. 'అభ్యంతరకరం' అంటే ఏమిటో నిర్వచించని ఈ ఉత్తర్వుల వేళ.. తరగతి గదుల్లో చరిత్రను రాసేదెవరన్న ప్రశ్న దేశం ముందు నిలిచింది.



పుస్తకం మనిషి ఆలోచనలను తీర్చిదిద్దే సాధనం. అదే పుస్తకం విషబీజాలు నాటే ఆయుధంగానూ మారగలదన్నది చరిత్ర చెబుతున్న చేదు నిజం. ఈ రెండు వాస్తవాల మధ్య సున్నితమైన గీత ఎక్కడ గీయాలన్న ప్రశ్న ఇప్పుడు జమ్మూకశ్మీర్‌లో పెద్ద చర్చకు దారితీసింది. కశ్మీర్‌లోని అన్ని విద్యాసంస్థల్లో ఉన్న పుస్తకాలు, పరిశోధన పత్రాలు, అకడమిక్ థీసిస్‌లను సమగ్రంగా సమీక్షించాలంటూ పాఠశాల విద్యా డైరెక్టరేట్ జూలై 6న జారీ చేసిన సర్క్యులర్ ఇందుకు కేంద్రబిందువు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, కోచింగ్ సెంటర్లు తమ గ్రంథాలయాలు, తరగతి గదుల్లో ఉన్న ప్రతి పుస్తకాన్నీ -కొత్తది, పాతది అనే తేడా లేకుండా పరిశీలించాలని ఉత్తర్వులు నిర్దేశిస్తున్నాయి. మతపరమైన భావాలను, అమల్లోని చట్టాలను, జాతీయ ప్రయోజనాలను, విద్యా విలువలను ఉల్లంఘించే అంశాలేమైనా కనిపిస్తే.. ఆ పుస్తకం పేరు, రచయిత, ప్రచురణకర్త, ప్రతుల సంఖ్య సహా పూర్తి వివరాలతో వారంలో నివేదిక ఇవ్వాలని సంస్థల అధిపతులను ఆదేశించారు. ఇవి హఠాత్తు ఆదేశాలేం కాదు. వేర్పాటువాద నేతలను, ఉగ్రవాదంతో సంబంధాలున్న వ్యక్తులను 'జమ్మూకశ్మీర్ మహనీయులు'గా కీర్తించే రెండు పుస్తకాలు ప్రభుత్వ పాఠశాలల గ్రంథాలయాల్లోకి చేరాయన్న వివాదమే దీనికి కారణం. వెంటనే ఆ పుస్తకాలను ఉపసంహరించడంతో పాటు.. వాటి ప్రచురణతో సంబంధం ఉన్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. విద్యాశాఖకు చెందిన ఎనిమిది మంది అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆ వైఫల్యాన్ని సరిదిద్దే క్రమంలో వచ్చిన ఈ సమీక్ష ఉత్తర్వులు మాత్రం.. 'తరగతి గదుల్లో ఈ ప్రాంత చరిత్రను ఎవరు నిర్వచించాలి?' అనే లోతైన ప్రశ్నను తెరపైకి తెచ్చాయి. ప్రతిపక్ష పార్టీలు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు దీన్ని విద్యా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణిస్తుండగా.. ప్రభుత్వం మాత్రం ఇది చదువుపై నియంత్రణ కాదని, చట్టవిరుద్ధమైన అంశాల తొలగింపేనని సమర్థించుకుంటోంది.

ప్రభుత్వ వాదనను పూర్తిగా కొట్టిపారేయలేని పరిస్థితి కశ్మీర్‌ది. దశాబ్దాలుగా రక్తసిక్తమైన ఆ లోయలో.. యువత హింస వైపు, ఉగ్రవాదం వైపు మళ్లడానికి తప్పుడు కథనాలు, వేర్పాటువాద సాహిత్యం వ్యవస్థీకృతంగా వ్యాప్తి చెందడమే ప్రధాన కారణమని దర్యాప్తులు, నిఘా సమాచారం చెబుతున్నాయన్నది అధికారుల విశ్లేషణ. 1980ల చివరి నుంచి పాకిస్తాన్ ప్రేరేపిత వేర్పాటువాదం వేలాది ప్రాణాలను బలిగొన్న నేపథ్యంలో.. లేత మనసులపై విషపు భావజాలం ముద్రపడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నది కాదనలేని వాస్తవం. 2019లో ఆర్టికల్ 370 రద్దు అనంతరం సాధారణ స్థితి దిశగా అడుగులు పడుతున్న తరుణంలో.. 'ప్రస్తుతం అంతా ప్రశాంతంగా ఉంది, పరిస్థితులు మళ్లీ అదుపు తప్పేందుకు అవకాశం ఇవ్వకూడదు' అన్న బీజేపీ ప్రతినిధి సునీల్ సేథీ వ్యాఖ్యల్లో ఆ ఆందోళనే ప్రతిధ్వనిస్తోంది. నిజానికి ఇలాంటి చర్యలు కశ్మీర్‌కు కొత్తేమీ కాదు. గతేడాది ఆగస్టులో అరుంధతీ రాయ్, ఏజీ నురానీ వంటి ప్రముఖుల రచనలు సహా 25 పుస్తకాలను 'తప్పుడు కథనాలతో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్నాయ'ంటూ ప్రభుత్వం స్వాధీన పరిధిలోకి తెచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీనగర్‌లోని పుస్తక దుకాణాలపై దాడులు జరిపి.. నిషేధిత సంస్థ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాయన్న ఆరోపణలతో వందలాది పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇక్కడే అసలు చిక్కు మొదలవుతుంది. వేర్పాటువాదాన్ని ప్రేరేపించే సాహిత్యానికీ.. కశ్మీర్ సంఘర్షణను, అక్కడి ప్రజల అనుభవాలను నమోదు చేసిన చరిత్ర రచనలకూ మధ్య తేడాను ఎవరు, ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తారు? తాజా ఉత్తర్వుల్లో 'అభ్యంతరకరమైన అంశాలు' అంటే ఏమిటన్న దానికి స్పష్టమైన నిర్వచనం లేకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. నిర్వచనం లేని నిషేధాధికారం క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యంగా మారే ప్రమాదం ఉంటుందన్నది పాలనా శాస్త్రం చెప్పే ప్రాథమిక పాఠం.

అందుకే ఈ వ్యవహారంలో సమతుల్యతే కీలకం కావాలి. దేశ భద్రత, యువత భవిష్యత్తు అనే రెండు మహత్తర లక్ష్యాల పేరుతో చేపట్టే ఏ చర్య అయినా.. రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛల పరిధిలోనే సాగాలన్నది ప్రజాస్వామ్య మౌలిక సూత్రం. తాజా ఆదేశాలు ఆ హక్కులకు విరుద్ధమన్న రాజకీయ విశ్లేషకుడు నూర్ అహ్మద్ బాబా వ్యాఖ్యలు, 'ఇది మా అకడమిక్ కంటెంట్‌ను మా నుంచి దూరం చేసే పెద్ద కుట్రలా కనిపిస్తోంది' అన్న అప్నీ పార్టీ నేత అల్తాఫ్ బుఖారీ ఆవేదన -వీటిని కేవలం రాజకీయ విమర్శలుగా కొట్టిపారేయడం సరికాదు. చరిత్రను చెరిపేయడం ద్వారా శాంతిని సాధించలేమని ప్రపంచ అనుభవాలు ఘోషిస్తున్నాయి. నిషేధిత సాహిత్యం భూగర్భ మార్గాల్లో, డిజిటల్ వేదికల్లో మరింత వేగంగా వ్యాపించే ఈ యుగంలో.. కేవలం గ్రంథాలయాల ప్రక్షాళనతో భావజాల యుద్ధాన్ని గెలవగలమనుకోవడం అమాయకత్వమే అవుతుంది. ఉగ్రవాదాన్ని కీర్తించే, హింసను సమర్థించే విషపూరిత సాహిత్యాన్ని విద్యార్థులకు దూరంగా ఉంచాల్సిందే --- అందులో ఎవరికీ భిన్నాభిప్రాయం ఉండనవసరం లేదు. కానీ ఆ ప్రక్రియ పారదర్శకంగా, స్పష్టమైన ప్రమాణాలతో, విద్యావేత్తలు, చరిత్రకారులు, న్యాయ నిపుణుల భాగస్వామ్యంతో సాగినప్పుడే దానికి విశ్వసనీయత లభిస్తుంది. 'అభ్యంతరకరం' అనే పదానికి నిర్దిష్ట నిర్వచనం ఇవ్వడం, సమీక్ష కమిటీల్లో స్వతంత్ర నిపుణులకు చోటు కల్పించడం, తొలగింపు నిర్ణయాలపై అప్పీలు అవకాశం ఉంచడం వంటి రక్షణలు ఏర్పరిస్తే.. ఈ చర్య దుర్వినియోగం అవుతుందన్న భయాలు చాలావరకు తొలగిపోతాయి. కశ్మీర్ యువతకు నిజంగా కావాల్సింది.. వాస్తవాలను దాచని, ద్వేషాన్ని రెచ్చగొట్టని, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించే విద్య. భయంతో కాదు, విశ్వాసంతో నిర్మించే విద్యా వ్యవస్థే లోయలో శాశ్వత శాంతికి పునాది వేయగలదు. పుస్తకాల పహారా కంటే.. మంచి పుస్తకాల పంపిణీయే బలమైన జవాబు అన్న స్పృహతో ప్రభుత్వం వ్యవహరిస్తే అది కశ్మీర్‌కే కాదు, యావత్ దేశానికీ మేలు చేస్తుంది. ■



మీరు ఎంత కష్టపడుతున్నారన్న దానికంటే.. మీ స్థానాన్ని వేరొకరితో భర్తీ చేయడం ఎంత కష్టం అనే దానిపైనే మీ సంపాదన ఆధారపడి ఉంటుంది. రోజుకు పన్నెండు గంటలు శ్రమించినా.. ఆ పనిని ఎవరైనా సులభంగా చేయగలిగితే, దానికి లభించే విలువ పరిమితమే. అదే.. అంత తేలికగా సాధించలేని ప్రత్యేక నైపుణ్యముంటే.. మీ కోసం అవకాశాలే వెతుక్కుంటూ వస్తాయి. అందుకే కేవలం శ్రమతో సరిపెట్టుకోకుండా.. నిత్యం కొత్త విషయాలు నేర్చుకుంటూ అరుదైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. 'నా స్థానంలో మరొకరిని పెట్టడం అంత సులభం కాదు' అనే స్థాయికి మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకున్న రోజు.. అసలైన గుర్తింపు, ఆదాయం రెండూ మీ సొంతమవుతాయి.

-మహాదేవ

వింతల్లో వింతలు

పేపర్ టవల్‌పై కళా వైభవం

కళాకారుల సృజనకు హద్దులుండవని నిరూపిస్తోంది పోలాండ్‌కు చెందిన చిత్రకారిణి హెలెనా మింగినోవిచ్. కాన్వాస్‌ను వదిలేసి.. మనం రోజూ వాడి పారేసే సాధారణ పేపర్ టవల్స్‌పై ఆమె అద్భుతమైన పెయింటింగ్స్ వేస్తోంది. పోలాండ్‌లోని పోజ్నాన్ నగరంలో పెరిగిన హెలెనా.. చిన్నప్పటి నుంచే తన భావాలను మాటలకంటే చిత్రాల ద్వారానే బాగా వ్యక్తీకరించగలదట. 'కాన్వాస్ గట్టిది, పెద్దది, ఆకర్షణీయమైంది. కానీ మనం మాత్రం ఈ పేపర్ టవల్ లాంటి వాళ్లం. అయినా అమరత్వం కోసం ప్రయత్నిస్తుంటాం' అంటూ జీవితపు క్షణభంగురత్వాన్ని ఆమె తన కళ ద్వారా చాటుతోంది. సున్నితంగా, తడిని ఇట్టే పీల్చుకునే పేపర్ టవల్‌పై పెయింటింగ్ ఎంతో కష్టమైనా.. ఎలాంటి ముందస్తు డిజైన్ లేకుండా ఫ్రీ-హ్యాండ్‌గా ఎయిర్‌బ్రష్డ్ యాక్రిలిక్ పొరలతో ఆమె రినైజాన్స్ శైలి కళాఖండాలను సృష్టిస్తోంది. శాంతికి పావురం, అందానికి హంస వంటి ప్రతీకలతో మనుషుల్నీ, జంతువుల్నీ చిత్రిస్తుంది. అక్టోబర్ 8నుంచి ప్యారిస్‌లోని 'గెలరీ ప్రిమా'లో ఆమె సోలో ఎగ్జిబిషన్ ప్రారంభం కానుండటం విశేషం.

విటమిన్ సి వల్ల అసలు మన శరీరానికి కలిగే ఉపయోగాలు ఏమిటి..?

మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాల్లో విటమిన్ సి కూడా ఒకటి. దీని వల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అందరికీ తెలుసు. అయితే కేవలం ఇదే కాదు, ఇంకా అనేక రకాల పనులకు కూడా మనకు విటమిన్ సి అవసరం అవుతుంది. విటమిన్ సి మనకు అనేక ఆహారాల్లో లభిస్తుంది. ఇది కణజాలాలకు మరమ్మత్తులు చేస్తుంది. కణాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఎంజైమ్‌ల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారేలా చేస్తుంది. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా విటమిన్ సి మనకు ఎన్నో రకాలుగా ఉపయోగం పడుతుంది. ఇది నీటిలో కరిగే విటమిన్. కనుక శరీరం ఈ విటమిన్‌ను నిల్వ ఉంచుకోలేదు. కాబట్టి ఈ విటమిన్‌ను మనం రోజూ తప్పనిసరిగా శరీరానికి అందించాల్సి ఉంటుంది.

విటమిన్ సి లోపం ఉంటే..

విటమిన్ సి లోపం ఉంటే మన శరీరం మనకు పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది. సాధారణంగా విటమిన్ సి ని మనం రోజూ మనుకు తెలియకుండానే తీసుకుంటాం. ఇది అనేక ఆహారాల్లో ఉంటుంది. కనుక విటమిన్ సి లోపం రాదు. కానీ కొందరు రోజూ ఒకేలాంటి ఆహారం తింటారు. అలాంటి వారితోపాటు మహిళల్లో విటమిన్ సి లోపం వచ్చే అవకాశాలు ఉంటాయి. ఈ లోపం ఉంటే తీవ్రమైన నీరసం, అలసట ఉంటాయి. శరీర మానసిక స్థితిలో సైతం మార్పులు వస్తాయి. బరువు తగ్గుతారు. కీళ్లు, కండరాల నొప్పులు ఉంటాయి. సులభంగా గాయాలు అవుతుంటాయి. పుండ్లు త్వరగా మానవు. దంతాలు, చిగుళ్ల సమస్యలు ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం అవుతుంది. జుట్టు బలహీనంగా మారి రాలిపోతుంది. జుట్టు చివర్లు చిట్లిపోతాయి. చర్మం పొడిబారి కాంతిహీనంగా కనిపిస్తుంది. ఇలా విటమిన్ సి లోపం ఉన్నవారిలో పలు లక్షణాలు కనిపిస్తాయి.

రోజుకు ఎంత కావాలి..?

విటమిన్ సి ఉండే ఆహారాలను తీసుకుంటే హైబీపీ తగ్గుతుంది. మూత్ర విసర్జన సాఫీగా అవుతుంది. మూత్రాశయ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. రక్త నాళాల గోడలపై పడే ఒత్తిడి తగ్గుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. విటమిన్ సి వల్ల కొల్లాజెన్ ఉత్పత్తి అవుతుంది. ఇది చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. మన శరీరం మనం తిన్న ఆహారాల్లో ఉండే ఐరన్‌ను సరిగ్గా శోషించుకోవాలంటే అందుకు విటమిన్ సి అవసరం అవుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు నియంత్రణలో ఉండాలంటే విటమిన్ సి అవసరం అవుతుంది. అలాగే కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలోనూ విటమిన్ సి పనిచేస్తుంది. ఇక విటమిన్ సి మనకు వయస్సును బట్టి నిర్దిష్టమైన మోతాదులో రోజూ అవసరం అవుతుంది. సాధారణంగా విటమిన్ సి 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారికి అయితే రోజుకు 40 నుంచి 60 మిల్లీగ్రాములు అవసరం అవుతుంది. అదే 18 ఏళ్లకు పైబడిన వారికి అయితే రోజుకు 90 మిల్లీగ్రాములు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు రోజుకు 120 మిల్లీగ్రాముల విటమిన్ సి అవసరం అవుతుంది.

వేటిని తినాలి..?

విటమిన్ సి మనకు అనేక ఆహారాల్లో లభిస్తుంది. ఇది మనం రోజూ తినే కూరగాయలు, ఆకుకూరల్లో అధికంగా ఉంటుంది. అలాగే సిట్రస్ జాతికి చెందిన పండ్లను కూడా తినవచ్చు. నారింజ పండ్లు, నిమ్మ, ఉసిరి, గ్రేప్ ఫ్రూట్, ద్రాక్ష, కివి పండ్లు, క్యాప్సికం, టమాటా, వెల్లుల్లి, పైనాపిల్, బొప్పాయి, పచ్చి బఠానీలు, అరటి పండ్లు, యాపిల్, కొత్తిమీర, పుదీనా, క్యాబేజీ, బ్రోకలీ, కాలిఫ్లవర్ వంటి పండ్లు, కూరగాయలను అధికంగా తింటుంటే విటమిన్ సి ని పొందవచ్చు. దీంతో ఆరోగ్యంగా ఉండవచ్చు.

వికారంగా ఉంటూ వాంతులు వచ్చినట్లు అనిపిస్తుందా..?

అయితే ఈ చిట్కాలను పాటించండి..!

వికారంగా ఉండడం లేదా వాంతికి వచ్చినట్లు అనిపించడం వంటి సమస్యలు సాధారణంగా మనకు అప్పుడప్పుడు వస్తుంటాయి. గర్భిణీలకు అయితే ఈ సమస్యలు సహజంగానే ఉంటాయి. కానీ వికారం, వాంతులు అనేవి కేవలం గర్భిణీలకే కాదు, అందరికీ అప్పుడప్పుడు వస్తుంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. జీర్ణ సమస్యలు ఉన్నవారికి, ఫుడ్ పాయిజన్ అయినప్పుడు, ఫుడ్ అలర్జీలు ఉన్నవారు పడని ఆహారం తిన్నప్పుడు, కలుషితమైన ఆహారం లేదా ద్రవాలను తీసుకున్నప్పుడు, పలు రకాల మందులను వేసుకున్నప్పుడు, పలు ఇతర కారణాల వల్ల కూడా ఈ సమస్యలు వస్తుంటాయి. అయితే ఈ సమస్యల నుంచి బయట పడేందుకు ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో పదార్థాలతోనే సహజసిద్ధంగానే ఈ సమస్యల నుంచి బయట పడవచ్చు. అందుకు కొన్ని చిట్కాలను పాటించాల్సి ఉంటుంది.

అల్లం, పుదీనా రసం..

వికారంగా ఉండడం, వాంతికి వచ్చినట్లు అనిపించడం వంటి సమస్యలు ఉంటే అల్లం అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో బయో యాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి వికారం, వాంతులు తదితర సమస్యల నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. అల్లం రసం తీసుకోవడం వల్ల వికారం నుంచి బయట పడవచ్చు. వాంతులు అవకుండా అడ్డుకోవచ్చు. రోజూ ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు 1 టీస్పూన్ అల్లం రసం సేవిస్తుండాలి. దీని వల్ల ఆయా సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే పుదీనా ఆకుల రసాన్ని సేవించడం వల్ల కూడా ఎంతో ఉపశమనం లభిస్తుంది. పుదీనాలో యాంటీ స్పాస్‌మోడిక్ గుణాలు ఉంటాయి. ఇవి కడుపు నొప్పి, వాంతులు, వికారం సమస్యలను తగ్గిస్తాయి. పుదీనా ఆకుల రసాన్ని ఒక టీస్పూన్ చొప్పున రోజుకు 3 పూటలా భోజనం చేసిన అనంతరం సేవిస్తుండాలి. దీంతో ఆయా సమస్యలు తగ్గుతాయి.

విటమిన్ బి6..

విటమిన్ బి6 ఉన్న ఆహారాలను తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. విటమిన్ బి6 మనకు ఎక్కువగా చేపలు, చికెన్, కోడిగుడ్లు, సోయాబీన్, తృణ ధాన్యాలు, కూరగాయల్లో లభిస్తుంది. ఈ ఆహారాలను తీసుకుంటున్నా కూడా వాంతులు, వికారం సమస్యల నుంచి బయట పడవచ్చు. ముఖ్యంగా గర్భిణీలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇక మనం తరచూ ఉపయోగించే నిమ్మకాయలు కూడా ఈ సమస్యల నుంచి మనల్ని బయట పడేలా చేస్తాయి. నిమ్మకాయలను దగ్గర పెట్టుకుని ఎప్పుడూ వాసన పీలుస్తుండాలి. దీని వల్ల వికారం సమస్యను తగ్గించుకోవచ్చు. అలాగే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తాగుతున్నా కూడా సమస్యలు తగ్గుతాయి. ఇలా రోజుకు 3 సార్లు తాగవచ్చు.

వీటిని తీసుకోవాలి..

వాంతులు, వికారం వంటి సమస్యలు ఉన్నవారు అరటి పండ్లను తింటుంటే ఉపయోగం ఉంటుంది. పుచ్చకాయలు, తర్బూజాలను కూడా తినవచ్చు. వీటి జ్యూస్‌ను తాగుతుంటే ఫలితం ఉంటుంది. చికెన్ లేదా వెజిటబుల్ సూప్‌ను సైతం తాగవచ్చు. ఇవి కూడా ఆయా సమస్యల నుంచి బయట పడేలా చేస్తాయి. ఇక ఈ సమస్యలు ఉన్నవారు నూనె పదార్థాలను తినకూడదు. కారం, మసాలాలు, ఘాటైన వాసన కలిగిన ఆహారాలు, తియ్యని పదార్థాలు, టీ, కాఫీ, మద్యం వంటి ఆహారాలు, పానీయాలను తీసుకోకూడదు. తిన్న వెంటనే నిద్రించకూడదు. కాసేపు వాకింగ్ చేస్తే మంచిది. ఒకేసారి అతిగా కాకుండా కొద్ది కొద్దిగా ఎక్కువ సార్లు తినడం అలవాటు చేసుకోవాలి. ఈ చిట్కాలను పాటిస్తూ ఆహారాలను తీసుకుంటుంటే వాంతులు, వికారం సమస్యల నుంచి సులభంగా బయట పడవచ్చు.

జీడిపప్పుతో పాలను ఇలా తయారు చేసి రోజూ తాగండి..

జీడిపప్పును మనం తరచూ తింటూనే ఉంటాం. వీటిని తీపి పదార్థాల తయారీలో వాడుతారు. మసాలా వంటకాల్లోనూ జీడిపప్పును వేస్తుంటారు. దీని వల్ల వంటకాలకు చక్కని రంగు, రుచి వస్తాయి. జీడిపప్పును నేరుగా లేదా వేయించుకుని కూడా తినవచ్చు. ఎంతో రుచిగా ఉంటుంది. అయితే ఈ పప్పును తినడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. కనుక రోజూ ఈ పప్పును గుప్పెడు మోతాదులో తినాలని పోషకాహార నిపుణులు సూచిస్తుంటారు. అయితే జీడిపప్పును నేరుగా కాకుండా వీటితో పాలను తయారు చేసి కూడా తీసుకోవచ్చు. జీడిపప్పు పాలు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. అనేక పోషకాలను అందిస్తాయి. జీడిపప్పు పాలను రోజూ ఒక కప్పు మోతాదులో ఉదయం తాగుతుంటే ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జీడిపప్పును రోజూ నేరుగా తినలేమని అనుకునేవారు వీటితో పాలను తయారు చేసి రోజూ తాగితే ఎంతో లాభం ఉంటుందని అంటున్నారు.

హైబీపీ ఉన్నవారికి..

జీడిపప్పుల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. కనుక జీడిపప్పు పాలను రోజూ సేవిస్తుంటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. జీడిపప్పులో మెగ్నిషియం, పొటాషియం అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి బీపీని నియంత్రిస్తాయి. కనుక ఈ పాలను రోజూ తాగుతుంటే హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. జీడిపప్పులో మెగ్నిషియం, కాపర్, విటమిన్ కె, క్యాల్షియం, విటమిన్ డి అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఈ పాలను రోజూ తాగుతుంటే ఎముకలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

కంటి ఆరోగ్యానికి..

జీడిపప్పులో లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కంటిలోని రెటీనాను రక్షిస్తాయి. దీని వల్ల కళ్లలోని కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్యంలో కళ్లలో శుక్లాలు రాకుండా చూసుకోవచ్చు. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. జీడిపప్పు పాలలో కాపర్ అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది మన శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల చర్మం సురక్షితంగా ఉంటుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. జీడిపప్పు పాలలో జింక్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీని వల్ల సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గించుకోవచ్చు. జీడిపప్పు పాలలో అధికంగా ఉండే ఐరన్, కాపర్ ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందేలా చేస్తాయి. దీంతో రక్తహీనత తగ్గుతుంది.

ఇలా తయారు చేయాలి..

ఇక జీడిపప్పు పాలను ఇంట్లోనే ఎంతో సులభంగా తయారు చేసుకోవచ్చు. బయట మార్కెట్‌లో లభించే జీడిపప్పు పాలను తాగాల్సిన పనిలేదు. జీడిపప్పు పాలను తయారు చేసేందుకు గాను 1 కప్పు జీడిపప్పు, 4 కప్పుల నీళ్లు, పప్పును నానబెట్టేందుకు మరి కొన్ని నీళ్లు, చిటికెడు సముద్రపు ఉప్పు, ఒక టీస్పూన్ తేనె (రుచి కోసం) తీసుకోవాలి. ముందుగా జీడిపప్పును నీటిలో వేసి రాత్రంతా నానబెట్టాలి. లేదా కనీసం 4 గంటలపాటు అయినా నానబెట్టాలి. తరువాత వాటిని తీసి 4 కప్పుల నీళ్లను పోసి అందులోనే ఉప్పు, తేనె వేసి కలిపి ఆ మిశ్రమాన్ని బ్లెండర్‌లో వేసి మెత్తగా పట్టుకోవాలి. దీంతో క్రీమ్ లాంటి మెత్తని పేస్ట్ లా ఉండే పాలు రెడీ అవుతాయి. అవసరం అనుకుంటే ఇంకొన్ని నీళ్లను కలుపుకోవచ్చు. ఇలా జీడిపప్పు పాలను తయారు చేసి గాలి చొరబడని సీసాలో నిల్వ చేసుకుంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈ పాలను తాగవచ్చు. ఈ పాలను ఉదయం బ్రేక్ ఫాస్ట్ అనంతరం సేవిస్తే ఎంతో ఫలితం ఉంటుంది. ఇలా జీడిపప్పు పాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

అన్ని విమర్శలకు రోహిత్ శర్మ సమాధానం ఇదే... పాక్ మాజీ క్రికెటర్ ప్రశంసలు

- ఇంగ్లండ్‌పై రోహిత్ శర్మ సెంచరీ అద్భుతమని కమ్రాన్ అక్మల్ ప్రశంస
- తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు రోహిత్ బ్యాట్‌తోనే జవాబిచ్చాడని వ్యాఖ్య
- రోహిత్, కోహ్లీ ఎప్పుడు రిటైర్ అవ్వాలో వారే నిర్ణయించుకుంటారని పేర్కొన్న అక్మల్
- భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని విశ్లేషణ
- కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టుకు నష్టం చేసిందని అభిప్రాయం

హైదరాబాద్ పెన్ పవర్: ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఓడినా, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ చేసిన సెంచరీపై పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ ప్రశంసల వర్షం కురిపించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు, విమర్శలకు ఈ సెంచరీయే సరైన సమాధానమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో రోహిత్ (138) ఆడిన ఇన్నింగ్స్ ఒక "స్టేట్‌మెంట్ ఇన్నింగ్స్" అని, 50 ఓవర్ల ఫార్మాట్‌లో తానెందుకు అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడో మరోసారి నిరూపించుకున్నాడని అక్మల్ అన్నాడు."2027 ప్రపంచకప్ జట్టులో రోహిత్‌కు చోటు దక్కదంటూ వదంతులు వ్యాపించాయి. కానీ, ఈ రోజు తన బ్యాట్‌తోనే వాటన్నింటికీ రోహిత్ సమాధానం చెప్పాడు" అని అక్మల్ ఒక పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. రోహిత్, విరాట్ కోహ్లీ లాంటి గొప్ప ఆటగాళ్లు ఎప్పుడు తప్పుకోవాలో వారే నిర్ణయించుకుంటారని, ఎవరూ వారిని బయటకు పంపలేరని స్పష్టం చేశాడు. భారత క్రికెట్ కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారిని ప్రదర్శన ఆధారంగా అంచనా వేయాలని సూచించాడు.దఅయితే, ఈ మ్యాచ్‌లో భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని అక్మల్ విశ్లేషించాడు. ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు భారీగా పరుగులు ఇవ్వడం, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టును దెబ్బతీసిందని అన్నాడు. "ప్రధాన బౌలర్లే 70 నుంచి 100 పరుగులు ఇస్తే మ్యాచ్ గెలవడం కష్టం. కుల్‌దీప్ ఉండుంటే వికెట్లు తీసి ఫలితాన్ని మార్చేవాడేమో" అని అభిప్రాయపడ్డాడు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 387/5 భారీ స్కోరు చేయగా, భారత్ 360/7 వద్ద పరిమితమై 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో సిరీస్‌ను 2-1 తేడాతో ఇంగ్లండ్ కైవసం చేసుకుంది.

ఓటమిని జీర్ణించుకోలేకపోయారా?.. అర్జెంటీనా ప్రవర్తన సిగ్గుచేటంటున్న ఫుట్‌బాల్ ప్రపంచం!

- ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్లో అర్జెంటీనాపై స్పెయిన్ విజయం
- ట్రోఫీ వేడుకలో స్పెయిన్‌ను అవమానించిన అర్జెంటీనా ఆటగాళ్లు
- ట్రోఫీ వేడుకకు వీపు చూపిన మెస్సీ సేన.. ఇది సిగ్గుచేటన్న విశ్లేషకులు
- గోల్డెన్ బాల్ అవార్డు సమయంలో మెస్సీ పేరుతో అభిమానుల నినాదాలు
- మ్యాచ్‌లో, ఆ తర్వాత ఇద్దరు అర్జెంటీనా ఆటగాళ్లకు రెడ్ కార్డులు

హైదరాబాద్ పెన్ పవర్: ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. నిన్న న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. అయితే, మ్యాచ్ అనంతరం జరిగిన పరిణామాలు ఫుట్‌బాల్ ప్రపంచంలో పెద్ద దుమారం రేపాయి. అర్జెంటీనా ఆటగాళ్లు, అభిమానుల ప్రవర్తన సంస్కారహీనంగా ఉందని, క్రీడాస్ఫూర్తికి మాయని మచ్చ తెచ్చిందని పలువురు విశ్లేషకులు మండిపడుతున్నారు.మ్యాచ్ ముగిసిన తర్వాత రన్నరప్ పతకాలు అందుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు, కొత్త ఛాంపియన్లను అభినందించకుండా మైదానం నుంచి వెళ్లిపోయారు. స్పెయిన్ జట్టు ట్రోఫీని స్వీకరించేందుకు సిద్ధమవుతుండగా, లియోనెల్ మెస్సీ సహా అర్జెంటీనా ఆటగాళ్లందరూ మైదానంలో మరోవైపుకు వెళ్లి వీపు చూపిస్తూ నిలబడ్డారు. అంతకుముందు అర్జెంటీనా పతకాలు అందుకుంటున్నప్పుడు స్పెయిన్ ఆటగాళ్లు చప్పట్లతో అభినందనలు తెలిపినా, అర్జెంటీనా మాత్రం ఆ గౌరవాన్ని తిరిగి ఇవ్వలేదు. ఇది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.ఇక, టోర్నమెంట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచిన స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ రోడ్రి 'గోల్డెన్ బాల్' అవార్డు అందుకుంటున్నప్పుడు స్టేడియంలోని అర్జెంటీనా అభిమానులు 'మెస్సీ, మెస్సీ' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ పరిణామం అక్కడి వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఈ ఘటనలపై +శ్శుశ్రీ.ఎశీఎ కథనం ప్రకారం.. టాక్‌స్పోర్ట్ బ్రాడ్‌కాస్టర్ అడ్రియన్ దర్హమ్ తీవ్రంగా స్పందించారు. "వారిలో కనీస సంస్కారం లేదు. ఈ రోజు వారు సిగ్గుపడే రీతిలో ప్రవర్తించారు. ఫైనల్లో ఓటమిని వారు అంగీకరించలేకపోతున్నారు. అర్జెంటీనా జట్టు ఈ ఆటకు, ప్రపంచకప్‌కు పూర్తి అవమానం" అని ఆయన ఘాటుగా విమర్శించారు.

"ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత సులువైన గ్రూప్‌లో డ్రా పొంది, నాకౌట్ దశలో కష్టపడి గెలిచి, ఇక్కడికొచ్చి తమను తాము అవమానించుకున్నారు" అని దర్హమ్ వ్యాఖ్యానించారు. టోర్నీ ఆద్యంతం అర్జెంటీనాకు అనుకూలంగా అనేక నిర్ణయాలు వచ్చాయని ఆయన ఆరోపించారు.

నిజానికి ఫైనల్ ముగిసిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లలో అసహనం కట్టలు తెంచుకుంది. దాంతో స్పెయిన్ ఆటగాళ్లపై దురుసుగా ప్రవర్తించారు. స్పెయిన్ ఆటగాళ్లతో గొడవకు దిగినందుకు లియాండ్రో పరేడెస్‌కు రెడ్ కార్డ్ చూపించారు. అంతకుముందు ఆట అదనపు సమయంలో ఎంజో ఫెర్నాండెజ్ కూడా రెండో ఎల్లో కార్డ్‌తో మైదానం వీడాడు. దీంతో ప్రపంచకప్ ఫైనల్లో రెడ్ కార్డ్ పొందిన ఆరో ఆటగాడిగా నిలిచాడు.

ఈ విజయంతో స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడమే కాకుండా వరుసగా 38 మ్యాచ్‌లలో అపజయం ఎరుగని యూరోపియన్ జట్టుగా రికార్డు సృష్టించింది. అయితే, స్పెయిన్ చారిత్రక విజయం కంటే అర్జెంటీనా వివాదాస్పద ప్రవర్తనే ఎక్కువగా చర్చనీయాంశంగా మారింది.

రూమర్స్ ఉంటనే మజా: రిటైర్మెంట్ పుకార్లపై తొలిసారి నోరువిప్పిన రోహిత్

హైదరాబాద్ పెన్ పవర్: న్యూఢిల్లీ: క్రికెట్ మక్కాగా పేరొందిన ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో చారిత్రాత్మక సెంచరీతో విమర్శకుల నోర్లు మూయించిన టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తొలిసారి తన రిటైర్మెంట్ పుకార్లపై స్పందించారు. ఇంగ్లాండ్?తో వన్డే సిరీస్ ముగిసిన అనంతరం హిట్ మ్యాన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇటువంటి రూమర్స్, విమర్శలు ఉంటేనే మజా ఉంటుందని అన్నారు. తనకు విమర్శలు కొత్తేమి కాదని.. తన సుదీర్ఘ కెరీర్?లో ఇటువంటి అటుపోట్లు ఎన్నో చూశానని అన్నారు. ఇటువంటి విమర్శలు, రూమర్స్ ఎన్ని వచ్చిన తాను పట్టించుకోనని.. తన దృష్టి మొత్తం కేవలం ఆటపైనే ఉంటుందని స్పష్టం చేశారు."నేను అరంగేట్రం చేసినప్పటి నుంచి నాపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. నేను జట్టులో ఉన్నంత కాలం ఆ విమర్శలు వస్తూనే ఉంటాయి. అది నాకు ముఖ్యం కాదు. మైదానంలో నేను ఏమి చేస్తాననేదే ముఖ్యం. జట్టు విజయంలో నా వంతు సహకారం అందించడానికి ప్రయత్నించాలనుకుంటున్నాను. నా దృష్టి అంతా దానిపైనే ఉంది. అయినా ఇలాంటి రూమర్స్, విమర్శలు లేకపోతే సరదా ఉండదు" అని రోహిత్ శర్మ పేర్కొన్నారు.

విరాట్ తో బ్యాటింగ్ వేరే లెవల్:

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో తన స్నేహం, కలిసి బ్యాటింగ్ చేయడం గురించి రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడం చాలా సరదగా ఉంటుందన్నాడు. మేము ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటామని.. క్రీజులో ఆలోచనలను పంచుకుంటామని తెలిపారు. కెరీర్?లో కోహ్లీ, తాను ఎన్నో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పామని చెప్పారు. లార్డ్స్ వన్డేలో మా ఇద్దరి పార్టనర్ షిప్ కూడా చాలా బాగుందన్నారు.

అక్షర గౌడ ఫ్యాషన్ సీక్రెట్స్

మాస్ మహారాజా కొత్త లవ్ స్టోరీ... ఆ హీరోయిన్ తో రొమాన్స్ ఫిక్స్!

టాలీవుడ్‌లో సరికొత్త మల్టీస్టారర్ కాంబినేషన్లకు ఎప్పుడూ విపరీతమైన క్రేజ్ ఉంటుంది. ముఖ్యంగా బాక్సాఫీస్ వద్ద తనదైన మాస్ ఎనర్జీతో దూసుకుపోయే 'మాస్ మహారాజా' రవితేజ, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో అలరించే హీరో శ్రీవిష్ణు కలయికలో ఓ భారీ హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం రూపుదిద్దుకోబోతోంది. అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో, టాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి తెరకెక్కించనున్న ఈ సినిమా గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక సెన్సేషనల్ న్యూస్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ క్రేజీ మల్టీస్టారర్‌లో రవితేజ సరసన జోడీగా నటించబోయే హీరోయిన్ ఎవరనే సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. ఆ వివరాలు చూద్దాం..

మలయాళ ముద్దుగుమ్మతో మాస్ మహారాజా రొమాన్స్:

ఈ మోస్ట్ అవైటెడ్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రవితేజ సరసన కథానాయికగా మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ ఎంపికైనట్లు టాలీవుడ్ వర్గాల్లో గట్టిగా టాక్ వినిపిస్తోంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేయు మోహనన్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మాళవిక, తన గ్లామర్ మరియు యాక్టింగ్ స్కిల్స్‌తో సౌత్ ఇండియాలోనే మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఇక ఈ సరికొత్త కాంబో వెండితెరపై సరికొత్త రొమాంటిక్ మ్యాజిక్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

హసిత్ గోలి మార్క్ వినోదం - క్రేజీ టైటిల్స్:

'రాజ రాజ చోర', 'స్వాగ్' వంటి విభిన్నమైన పూర్తి వినోదాత్మక చిత్రాలతో దర్శకుడిగా తనదైన ముద్ర వేసుకున్న హసిత్ గోలి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను హ్యాండిల్ చేస్తున్నారు. రవితేజ మాస్ క్రేజ్‌ను, శ్రీవిష్ణు సెటిల్డ్ కామెడీ టైమింగ్‌ను పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తూ ఆయన ఒక అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను దిల్ రాజు తన 'శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్' బ్యానర్‌పై



నిర్మిస్తున్నారు.

2027 సంక్రాంతి బరిలో నవ్వుల జాతర:

ఈ భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని ఫ్యామిలీ ఆడియన్స్‌ను ప్రధానంగా టార్గెట్ చేస్తూ, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ పక్కా ప్లానింగ్‌తో ఉన్నారు. సంక్రాంతి సీజన్ అంటేనే ఫ్యామిలీస్ అన్నీ థియేటర్లకు క్యూ కడతాయి. అలాంటి టైమ్‌లో రవితేజ, శ్రీవిష్ణు కలిసి ఒకే ఫ్రేమ్‌లో కడుపుబ్బా నవ్వించడానికి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద నవ్వుల పండగ గ్యారెంటీ అనే చర్చ అప్పుడే మొదలైంది. మాళవిక మోహనన్ గ్లామర్ కూడా తోడవ్వడం ఈ పండుగ వినోదానికి మరింత ప్లస్ కానుంది.

రవితేజ, శ్రీవిష్ణు, హసిత్ గోలి, దిల్ రాజు.. ఇలా క్రేజీ టాలెంట్ అంతా ఒకే చోట చేరి సృష్టిస్తున్న ఈ సినిమా టాలీవుడ్‌లో సరికొత్త ట్రెండ్ సెట్ చేయబోతోంది. మాస్ మహారాజా పక్కన మాళవిక మోహనన్ కెమిస్ట్రీ ఎలా ఉండబోతోందో చూడాలనే కుతూహలం అందరిలోనూ ఉంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు మరియు హీరోయిన్ ఎంపికకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. మరి 2027 సంక్రాంతి బరిలో రాబోతున్న ఈ 'వీరాధివీరులు' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డుల సంచలనం సృష్టిస్తారో చూడాలి.

అదితి మెరిసే చీర లుక్‌లో తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965